teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 03 | సంచిక : 178 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 24 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## తుఫానుగా మారిన అల్పపీడనం

ఈ తుఫానుకు "దానా" అని ఐఎండి నామకరణం

రెండు ఉమ్మడి జిల్లాలపై ఉండనున్న దానా ఎఫెక్ట్



02

# దీపావళి సందర్భంగా కొత్త రెవెన్యూ చట్టం



మరింత సులభతర రెవెన్యూ వ్యవహారాలే లక్ష్యంగా చట్టం

కొత్త చట్టం ప్రయోజనాల కోసం ప్రజలలో ఆసక్తి

తెలంగాణ ప్రభుత్వం దీపావళి పండుగ సందర్భంగా కొత్త రెవెన్యూ చట్టం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఈ చట్టం ద్వారా రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్, రెవెన్యూ వ్యవహారాలు మరింత సులభతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ఈ కొత్త చట్టం ప్రకారం, భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. దీని వల్ల ప్రజలు ఆన్‌లైన్‌లోనే తమ భూముల వివరాలను నమోదు చేసుకోవచ్చు. అలాగే, భూముల రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన డాక్యుమెంట్లను కూడా ఆన్‌లైన్‌లోనే సమర్పించవచ్చు. రెవెన్యూ శాఖ అధికారులు ఈ కొత్త చట్టం ద్వారా భూముల రిజిస్ట్రేషన్

మిగతా 2 లో



## భార్యలు రోడ్డెక్కితే భర్తలను సస్పెండ్ చేసే చట్టం ఎక్కడుంది

రేవంత్ రెడ్డి సర్కార్‌పై నిప్పులు చెరిగిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

12వ బెటాలియన్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌పై స్పందించిన ఆర్ఎస్పీ

.. వివరాలు 2లో

## తాడ్వాయి గుండా వెళ్లనున్న కొత్త రైల్వే లైన్

రైల్వే పనుల్లో వేగం పెంచిన కేంద్రం

యుద్ధ ప్రాతిపదికన భూసేకరణకు ముఖ్య అధికారుల నియామకం

తెలంగాణా రాష్ట్రంలో రైల్వే ప్రగతిలో పరుగులు పెడుతుంది. ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో ప్రజల అవసరాలకు తగ్గట్టు రైళ్ళ సంఖ్యను పెంచటం, కొత్త రైల్వే లైన్లు ఏర్పాటు చేయటం చేస్తున్న రైల్వే, రాష్ట్ర వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్ లను అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేసింది.

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్):ఇదే క్రమంలో తెలంగాణా రాష్ట్ర రైల్వే పురోగతికి పెద్ద పీట వేస్తున్న కేంద్రం తెలంగాణ రాష్ట్రంలోని మణుగూరు - రామగుండం రైలు మార్గంలో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు అనుమతించినందున ఇప్పుడు

మిగతా 2 లో






## మూసీ బాధితులకు ఈటెల రాజేందర్ పిలుపు

ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు తరలిరావాలి: ఈటెల

ఈనెల 25న ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు మూసీ బాధిత కుటుంబాలు తరలిరావాలని ఎంపీ ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజక వర్గంలోని మూసి పరివాహక ప్రాంతం అయిన రామంతపూర్ లోని కేసీఆర్ నగర్, బాలకృష్ణ నగర్, సాయికృష్ణ నగర్ ప్రాంతాల ఈటెల రాజేందర్ సందర్శించారు.

హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కేసీఆర్ పై విసిగిపోయి, కాంగ్రెస్ ఆశ చూపే హామీలు విని కాంగ్రెస్ ని పట్టం కట్టి గెలిపించారని తెలిపారు. కాంగ్రెస్ ని గెలిపించిన పాపానికి గత రెండు మూడు నెలలుగా చెరువుల వద్ద, మూసి

మిగతా 2 లో



## మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా కేసులో విచారణ

మేజిస్ట్రేట్ శ్రీదేవి ఆదేశాలతో కేటీఆర్ వాంగ్మూలం రికార్డు

మంత్రి సురేఖ వివరణకు అవకాశం కల్పిస్తూ నోటీసులు

.. వివరాలు 2లో

## రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్

లోపాయికారీ ఒప్పందంతో ధర్జాగా భూములు కొల్లగొట్టారు

గత ప్రభుత్వ నిర్వహణపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ధరణి పోర్టర్ ప్రారంభం నుంచి రైతుల పాలిట శాపంగా మారిందని అన్నారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. ధరణి పోర్టల్‌పై ఆయన మాట్లాడుతూ ఊరు పేరు లేని సంస్థలకు ధరణిని అప్పగించారు. ఆ రెండు సంస్థలు కేటీఆర్, హరీష్ రావుకి లోపాయికారీ ఒప్పందంగా ఉండి ధర్జాగా భూములు కొల్లగొట్టారని ఆరోపించారు. అందుకే ధరణి పోర్టల్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీ

మిగతా 2 లో



## లీగల్ నోటీసుకు భయపడే వారెవరూ లేరు

రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులా..?

కేటీఆర్‌కు కౌంటరిచ్చిన కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరు అంటూ కేటీఆర్‌కు కౌంటరిచ్చారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు అంటూ కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకు పంపిన లీగల్ నోటీసులపై బండి సంజయ్ స్పందించారు. ఈ క్రమంలో

మిగతా 2 లో






## హెచ్సీఏ వివాదాలపై సుప్రీం కోర్టులో విచారణ

వాదనను వ్యతిరేకిస్తున్న మెంబర్లు

కేసు తదుపరి విచారణ నేటికీ వాయిదా

.. వివరాలు 2లో



## కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సాగుతున్న పీసీ ఘోష్ విచారణ

ఈఎన్సీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ లపై ప్రశ్నల వర్షం

3గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు సంధించిన కమిషన్

.. వివరాలు 2లో

## మూడో రోజు ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించలేదు

తప్ప ఎలాంటి సంఘటనలు లేవు: టీజీపీఎస్సీ




02

## ముత్యాలమ్మ విగ్రహా ధ్వంసంపై స్పందించిన న్యాయస్థానం

సీసీ టివి ఫోటేజ్, శోషల్ మీడియా నుండి వీడియోలను తొలగించాలి

కేంద్ర సైబర్ క్రైం విభాగాన్ని హైకోర్టు ఆదేశాలు



02



## ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను విచారించిన ఈడీ

42 ఎకరాల భూమి అక్రమ బదిలీ కేసు నిజాల వేటలో ఈడీ

ఏడున్నర గంటలపాటు సుదీర్ఘ ప్రశ్నలు

.. వివరాలు 2లో

# దీపావళి సందర్భంగా కొత్త రెవెన్యూ చట్టం

**మొదటి పేజీ తరువాయి**

ప్రక్రియను వేగవంతం చేయాలని భావిస్తున్నారు. దీని వల్ల ప్రజలకు సమయం మరియు డబ్బు ఆదా అవుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఇంకా, ఈ చట్టం ద్వారా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతి తగ్గించేందుకు కూడా చర్యలు తీసుకోనున్నారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన ఫీజులను ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు. మొత్తానికి, ఈ కొత్త రెవెన్యూ చట్టం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యం కల్పించడమే కాకుండా, భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని వల్ల భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు మరింత సులభతరం అవుతాయని ఆశిస్తున్నారు. ఈ కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రజలు దీని ప్రయోజనాలను ఎలా అనుభవిస్తారో చూడాలి.




## తాడ్వాయి గుండా వెళ్లనున్న కొత్త రైల్వే లైన్


**మొదటి పేజీ తరువాయి**



పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన కొనసాగించేందుకు కొందరు ముఖ్య అధికారులను నియమిస్తూ కేంద్రం అక్టోబర్ 16న ప్రత్యేక నోటీసులిచ్చింది. జిల్లాల్లోని వివిధ ప్రాంతాలలో ఈ రైల్వే ప్రాజెక్ట్ కోసం సేకరించాల్సిన భూములను అధికారులు గుర్తిస్తున్నారు. భూపాలపల్లి ఆర్డీఓ, కాటారం సబ్ కలెక్టర్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ ఈ భూసేకరణ బాధ్యతలను చేపట్టారు. భూసేకరణకు సంబంధించి నష్ట పరిహారం ఎంత ఇవ్వాలి అన్న దానిపైన కూడా కసరత్తు చేస్తున్నారు. మల్హార్‌రావు, కాపురం మండలాలు కాటారం సబ్ కలెక్టర్ చూస్తుండగా, ఘన్‌పూర్, భూపాలపల్లి మండలాలను భూపాలపల్లి ఆర్డీఓ చూస్తున్నారు. ముత్తారం, మంథని, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి ప్రాంతాలకు పెద్దపల్లి అదనపు కలెక్టర్ భూసేకరణ పనులు చూస్తున్నారు. కాటారం, మల్హార్‌రావు, ఘన్‌పూర్, భూపాలపల్లి మండలాల మీదుగా మేడారం నుండి మణుగూరు వరకు 207.80కిలోమీటర్ల మేర బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ పనులు చేపట్టేలా రైల్వే శాఖ నివేదికలు తయారు చేసింది.

ఈ ట్రాక్ ఆలోచన మొదట 1999 లో రాగా, మళ్ళీ 2013-14లో దీనిపై దృష్టి సారించారు. మొదట 1,100 కోట్లకు పైగానే ఖర్చు అవుతుందని భావించిన వారు ఇప్పుడు దాదాపు 3,600 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఈ రైలు ట్రాక్ చాలా ముఖ్యమైనదని చెప్పొచ్చు. ఎందుకంటే ఇది రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుండి భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు అవసరమైన బొగ్గును రవాణా చేయటం కోసం సహాయపడుతుంది. పర్యాటకులు వెళ్లడానికి ఇష్టపడే వివిధ ప్రాంతాలకు ప్రజలు మరింత సులభంగా ప్రయాణించడానికి కూడా ఈ రైల్వే ట్రాక్ సహాయపడుతుంది. ఈ కొత్త రైల్వే లైన్ తాడ్వాయి గుండా వెళుతుంది. దీని వలన సందర్శకులు మేడారంలోని సమ్మక్క మరియు సారలమ్మ దేవాలయాలకు చేరుకోవడం సులభం అవుతుంది. ఈ రైలు మార్గం ములుగు, భూపాలపల్లి ప్రాంతాల్లో సరకు రవాణాను సులభతరం చేయడం ద్వారా వ్యాపారాల వృద్ధికి కూడా దోహదపడుతుంది.

## కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సాగుతున్న పీసీ ఘోష్ విచారణ



**మొదటి పేజీ తరువాయి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ బుధవారం విచారణ జరిపింది. బుధవారం జరిగిన విచారణకు కాళేశ్వరం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్సీ నాగేందర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్ పై కమీషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్ లో నిబంధనలు పాటించలేదని, రామగుండం ఈఎన్సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ కు నాగేందర్ వివరించారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా? గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. కాగా రామగుండం ఈఎన్సీ నిబంధనలు పాటించలేదని కమిషన్ ముందు నాగేందర్ చెప్పినట్లు తెలుస్తోంది.

**దస్త్రాలు పరిశీలించకుండానే అఫిడవిట్ ఎలా ఇస్తారు?**

మరోవైపు కాళేశ్వరం కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్ తీరుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఎన్ని సార్లు సందర్శించారని కమిషన్ ప్రశ్నించగా మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు ప్రమాదం జరగకముందు పరిశీలించానని అజయ్ బదులిచారు. దాంతో సుందిళ్ల బ్యారేజీని ఎందుకు పరిశీలించలేదు? తొలిసారి వరద వచ్చాక 3 బ్యారేజీలను సందర్శించారా అని కమిషన్ ప్రశ్నించింది. సమస్యలు ఉన్నాయని నివేదిక రాకపోవడంతో సందర్శించలేదని జవాబిచ్చారు. అయితే క్వాలిటీ కంట్రోల్ సీఈ స్థాయిలో ఉంటూ రికార్డులను సరిచూసుకోకుండానే అఫిడవిట్ ఎలా సమర్పిస్తారని కమిషన్ నిలదీశింది.

## లీగల్ నోటీసుకు భయపడే వారెవరూ లేరు

**మొదటి పేజీ తరువాయి**



బండి సంజయ్, కేటీఆర్ నాకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూశాను. లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరు. నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీస్ ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన మంచి వాడు అనుకుంటన్నాడు. ఆయన భాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం కూడా ముందుకు వెళ్తాం' అంటూ కామెంట్స్ చేశారు. అలాగే, కేటీఆర్ నోటీసులపై తెలంగాణ బీజేపీ నేతలు కూడా స్పందించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాను. లీగల్ నోటీసులతో కేటీఆర్ రాజకీయ జీవితానికి చరమ గీతం పడటం ఖాయం. దద్దమ్మ, సన్యాసి అంటూ కేసీఆర్, కేటీఆర్ కొన్ని వందల సార్లు మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు పారిపోయే రోజులు వచ్చాయి. లీగల్ నోటీసులతో ఆట మీరు మొదలుపెట్టారు. రోజు లీగల్ నోటీసులు అందుకోవడానికి కేటీఆర్ సిద్ధంగా ఉండాలి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీజేపీ ఎస్సీ మోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.కుమార్ మాట్లాడుతూ..'లీగల్ నోటీసులకు బండి సంజయ్ భయపడరు. బండి సంజయ్‌ను ఎన్నో సార్లు కేసీఆర్, కేటీఆర్ అవమానించారు. భాషను మార్చుకోవాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసులు పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం అంటూ చెప్పుకొచ్చారు.

## తుఫానుగా మారిన అల్పపీడనం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): తూర్పు, మధ్య బంగాళాఖాతంలో రెండు రోజుల క్రితం ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా, ఆ తర్వాత తుఫానుగా మారింది. కాగా ఐఎండీ ఈ తుఫానుకు దానా అని నామకరణం చేసింది. దానా తుఫాను గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం ఉత్తర ఒడిషా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాను ప్రభావంతో పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఏపీలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక తెలంగాణలో దానా తుఫాన్ ఎఫెక్ట్ రెండు ఉమ్మడి జిల్లాలపై ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుండి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో పొడి వాతావరణం ఏర్పడుతుందని తెలిపింది. శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో తెలిపాటి నుండి మోస్తరు వర్షాలు పడనున్నట్టు తెలిపిన వాతావరణ కేంద్రం ఆయా జిల్లాలకు శని, అదివారాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది.



## హెచ్‌సీఏ వివాదాలపై సుప్రీం కోర్టులో విచారణ




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ప్రత్యేక బెంచ్ వాదనలు విన్నది. ఈ కేసు తదుపరి విచారణను గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తూ బెంచ్ నిర్ణయించింది. కాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎలక్ట్రోరల్ జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ కోసం గతంలో జస్టిస్ ఎల్ నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. హెచ్‌సీఏకి ఎన్నికలు నిర్వహించడమే కాకుండా నిర్వహణపై సిఫార్సులు చేయాలని జస్టిస్ ఎల్ నాగేశ్వరరావుకు సూచించింది. అయితే హెచ్‌సీఏ సభ్యుల్లో ఎక్కువ మంది కుటుంబ సభ్యులేనని ఆయన చేసిన సిఫార్సుపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. వారి పిటిషన్లపైనే ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోంది. కాగా హెచ్‌సీఏలో కుటుంబ సభ్యులే ఎక్కువ మంది మెంబర్లుగా ఉన్నారని సుప్రీంకోర్టు దృష్టికి జస్టిస్ నాగేశ్వరరావు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉండడంతో హెచ్‌సీఏ ఎన్నికల నిర్వహణలో పలు అంశాలు ప్రభావితం అవుతున్నాయని ఆయన చెప్పారు. అయితే మెంబర్లు మాత్రం ఈ వాదనను వ్యతిరేకిస్తున్నారు.

## ఐఏఎస్ ఆమోయ్ కుమార్‌ను విచారించిన ఈడీ

హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ఐఏఎస్ అధికారి ఆమోయ్ కుమార్ ఈడీ విచారణ ముగిసింది. మీడియా కంట పడకుండా ఉదయం 8గంటలకే ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఏడున్నర గంటలపాటు సుదీర్ఘంగా ఈడీ అధికారులు ఆమోయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. గతంలో రంగారెడ్డి జిల్లా భూముల కేటాయింపులో అక్రమాలు జరిగాయన్న కేసులో ఆమోయ్ కుమార్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. మహేశ్వరం మండలం నాగారంలో భూదాన్ భూముల బదిలీపై ఈడీ విచారణ కొనసాగుతోంది. రూ.వందల కోట్ల విలువైన 42 ఎకరాల భూమిని అక్రమంగా బదిలీ చేశారని ఆమోయ్‌కుమార్‌ను ఈడీ ప్రశ్నించినట్టు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా ఆయన పనిచేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అమోయ్ కుమార్ పాత్రపై నిజానిజాలు తేల్చేందుకు ఆయన్ను విచారించినట్టు తెలుస్తోంది.

## రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టర్

**మొదటి పేజీ తరువాయి**

ఎన్‌ఐసీకి అప్పగించినట్లు చెప్పారు. మూడేళ్ల నిర్వహణకు ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్న ఆయన పనితీరు బాగుంటే మరో రెండేళ్లు పొడిగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పొందంలో పేర్కొందని తెలిపారు. బీజేపీ నేతలు మాట్లాడే దానికి అర్థం ఉండాలి. మతాన్ని అడ్డు పెట్టుకొని ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం మంచిదికాదు. ప్రతి అంశంతో ఓట్లు దండుకోవాలనుకోవడం అవివేకం. వామపక్ష భావజాలంతో ఉండి బీజేపీకి వెళ్ళింది మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కదా అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం ఇచ్చిన వాగ్దానాలు ఎంతమేర నెరవేర్చారు అని ఈటల ప్రధాని మోదీని అడగాలని సూచించారు.

## మూసీ బాధితులకు ఈటెల రాజేందర్ పిలుపు

**మొదటి పేజీ తరువాయి**

పరివాహక ప్రాంతం వద్ద గత ముప్పై ఎండ్లకు పైగా ఇంటి నిర్మాణాలు చేపట్టి నివసిస్తున్న కుటుంబాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని మండిపడ్డారు. శనివారం, ఆదివారం వస్తే చాలు ఈ ప్రాంత ప్రజలు నిద్రలేకుండా భయబ్రాంతులకు గురిచేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజల శవాల మీద నడుచుకుంటూ వెళ్లి ఇమాక్స్ లాంటి నిర్మాణాలు చేపట్టుకోవాల్సి వస్తుంది కానీ మా గొంతులో ప్రాణం ఉండగా ఇక్కడి ఇండ్లను కూల్చనీయము ఇక్కడి ప్రజలు చెప్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సామాన్య ప్రజానీకం పైన దౌర్జన్యం కొనసాగిస్తున్నారని అన్నారు. బీజేపీ పార్టీ ఈ పేదలకు అండగా ఉంటుంది%ౌ% ఇండ్లను కులగొట్టలనీ ప్రయత్నిస్తే కబర్దార్ అని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ పరంగా నేడు, రేపు మూసి పరివాహక ప్రాంతం ప్రజలను ఇండ్లను సందర్శించి, వారి మాటలను ప్రతిబింబించే విధంగా 25న ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తామన్నారు. మాకోసం చేస్తున్న ధర్నాకు వంద శాతం హాజరు అవుతాము అని ఇక్కడి ప్రజలు చెప్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి, కానీ సుందరీకరణ పేరుతో కూల్చే ప్రయత్నం చేయొద్దు అన్నారు. ఆనాడు నిజాం ప్రభుత్వం చేపట్టిన పనులు చేపట్టి, మూసి సుందరీకరణ చేపట్టాలన్నారు ఈటెల. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు, మూసి పరివాహక ప్రాంతం బాధితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భార్యలు రోడ్డెక్కితే భర్తలను సస్పెండ్ చేసే చట్టం ఎక్కడుంది

హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): భార్యలు రోడ్డెక్కితే భర్తలను సస్పెండ్ చేసే చట్టం ఎక్కడా లేదు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. నల్లగొండలోని 12వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్పీ మీడియాతో మాట్లాడారు. పోలీసు కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తేయాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. నాడు కేసీఆర్ కానిస్టేబుళ్లను మనుషులుగా చూస్తే నేడు రేవంత్ వాళ్ళను మరమనుషులుగా చూస్తున్నాడు. రాష్ట్రంలో హోంమంత్రి లేడు, రేవంత్ రెడ్డి దగ్గరే హోం శాఖ ఉంది. రేవంత్ రెడ్డి పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవంలో పాల్గొన్న రోజే పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డు ఎక్కాయి. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు స్పెషల్ కానిస్టేబుల్స్ 15 రోజులు డ్యూటీ చేస్తే, 4 రోజులు సెలవులు ఉండేవి. ఇవ్వాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 26 రోజులు కంటిన్యూ డ్యూటీ చేస్తే, 4 రోజులు లీవ్ ఇస్తామని అంటున్నారని ఆర్ఎస్పీ తెలిపారు. ఇక రాష్ట్రంలో రోజురోజుకు శాంతిభద్రతలు దిగజారిపోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి హోం మంత్రి లేడు. సీఎం రేవంత్ రెడ్డి వద్దనే హోం శాఖ ఉంది. రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఏక్ పోలీసు నినాదం అన్నారు. మరి ఏక్ పోలీసు నినాదం ఏమైంది రేవంత్ రెడ్డి అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. హైదరాబాద్ వ్యాప్తంగా నేరాలు పెరిగిపోతున్నాయి. అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ లింగారెడ్డి దంపతులను దారుణంగా హత్య చేశారు. ఇప్పటి వరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. బెల్లంపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తపై గొడ్డలితో దాడి చేశారు. బీఆర్ఎస్ హయాంలో పెట్టిన సీసీ కెమెరాలు ఇప్పటి వరకు పని చేయడం లేదని ఆర్ఎస్పీ తెలిపారు. కేటీఆర్, హరీష్ రావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా వాళ్లపై ఎన్ని కేసులు పెట్టారని రేవంత్ రెడ్డి రివ్యూ చేస్తున్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం రోజు డీజీపీ నాకు ఆహ్వానం పంపారు. నేను బయటకు వెళ్తానంటే పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పోలీసు శాఖలో అశాంతి నెలకొంది. మైనంపలి హన్మంతరావు గజ్వేల్‌లో కేటీఆర్, హరీష్ రావుపై పెట్రోల్ పోసి చంపుతాను అంటే ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. కొల్లాపూర్‌లో శ్రీధర్ రెడ్డిని హత్య చేస్తే ఇప్పటి వరకు నింధితులను అరెస్టు చేయలేదు. జూపల్లి కృష్ణారావు హస్తం ఉందని శ్రీధర్ రెడ్డి తండ్రి డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీని ట్రాన్స్‌ఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. శ్రీధర్ రెడ్డి హత్యలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పాత్రపై విచారణ చేయాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.


## మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా కేసులో విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా కేసులో కేటీఆర్ వాంగ్మూలాన్ని కోర్టులో రికార్డు చేశారు. కేటీఆర్ వెంట న్యాయవాదులు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, బాల్క సుమన్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు. మేజిస్ట్రేట్ శ్రీదేవి ఆదేశాల మేరకు ఫిర్యాదుదారుడైన కేటీఆర్‌తో పాటు సాక్షులుగా ఉన్న తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌కుమార్ వాం గ్మూలాలను సైతం కోర్టు రికార్డు చేయనుంది. మంత్రి కొండా సురేఖ కోర్టుకు హాజరై తన మీద దాఖలైన ఆరోపణల గురించి వివరణ ఇచ్చేందుకు అవకాశాన్ని కల్పిస్తూ కోర్టు నోటీసుల్ని జారీ చేసింది.

## మూడో రోజు ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మూడో రోజు గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల నిర్వహణ కొనసాగింది. రెండు రోజులు ప్రశాంతంగా కొనసాగిన గ్రూప్ 1 పరీక్షలు. మూడో రోజుకు చేరింది. కాగా తెలంగాణలో తొలిరోజు నిర్వహించిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగియగా, తొలిరోజు పరీక్షకు 31,383 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష హాలులోకి అనుమతించాలని అధికారులు స్పష్టం చేశారు. రెండవ రోజులు 22 వేల 744 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా మొత్తం 72.4 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొదటి రోజు కొంత మంది విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనందున పరీక్షకు అనుమతించలేదు అధికారులు. దీంతో మొదటి రోజు అభ్యర్థులు రాయలేకపోయారు. పరీక్షా కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించకపోవడమే తప్ప ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు లేవని టీజీపీఎస్సీ పేర్కొంది. హైదరాబాద్‌లో 5 వేల 613 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 87.23 శాతం మందికి గాను 4 వేల 896 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాశారు. మరో 717 మంది గైర్హాజరయ్యారు. రంగారెడ్డి పరిధిలో 8 వేల 11 మందికి గాను 5 వేల 854 మంది పరీక్ష రాశారు. మరో 2 వేల 157 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఈ నెల 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని పరీక్షలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని టీజీపీఎస్సీ భావిస్తోంది.

## ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసంపై స్పందించిన న్యాయస్థానం



హైదరాబాద్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో సంచలంగా మారిన సికింద్రాబాద్‌లోని మహంకాళి మందిరంలోని ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం వివాదంపై ఉన్నత న్యాయస్థానం స్పందించారు. విగ్రహం ధ్వంసం చేస్తున్నప్పుడు రికార్డయిన సీసీటీవీ ఫుటేజీలకు సంబంధించిన వీడియోలను, వాటి లింకులను సామాజిక మాధ్యమాల నుంచి వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర సైబర్ క్రైం విభాగాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం నగరంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఈ వివాదం అటు మతపరంగానే కాకుండా ఇటు రాజకీయపరంగానూ రచ్చకు కారణమైంది. కాగా ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసానికి సంబంధించిన వీడియోలు కేవలం నగరంలోనే కాదు. రాష్ట్రమంతా వ్యాపిస్తున్నాయి. దీంతో ఈ వివాదం నగరం నుంచి రాష్ట్రా స్థాయికి చేరుకుంటోంది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## ఒక్కొక్కరు 16 మంది పిల్లలను కనండి

ప్లీజ్.. పెళ్లి చేసుకోండి, పిల్లల్ని కనండి, అవసరమైతే లీవ్స్ పెట్టండని అంటోంది. ఎందుకని ఈ మార్పు... మొన్న జపాన్, నిన్న చైనా... ఇప్పుడు భారత్... కొత్త స్లోగన్ అందుకుంటున్నాయి..యువత తగ్గిపోతున్న కారణంగా చైనా జీడీపీ కూడా తగ్గుతోంది కాబట్టి. ఇక జపాన్. అమెరికా తరువాత అత్యంత శక్తివంతమైన దేశం. ఎకానమిలో అమెరికా తరువాత జపానే. కాని, చేజేతులా ఆ ప్లేస్‌ను చైనాకు ఇచ్చేసింది. 2010 తరువాత ఆ సెకండ్ ప్లేస్‌ను చైనా లాగేసుకుంది. కారణం.. జపాన్‌లో పిల్లల సంఖ్య తగ్గడం. యువత తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరిగినందుకు.. జపాన్ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోయింది. ఇక ఇండియా. అతి త్వరలోనే జర్మనీని క్రాస్ చేసి జపాన్ ప్లేస్‌లోకి వెళ్లబోతోంది. మూడునాలుగేళ్లలో టాప్-3 ఎకానమీగా ఇండియా ఉండబోతోంది ఇండియా. కారణం.. యూత్ ఎక్కువగా ఉండడం. యువత లేని దేశాలు ఆర్థికపరంగా ఎలా కిందకు పడిపోతున్నాయో స్వయంగా చూస్తున్నాం. అదే యువత ఉన్న కారణంగా ఆర్థికంగా ఇండియా ఎలా ఎదుగుతోందో కూడా చూస్తున్నాం. యూత్ లేకపోతే దేశాలు అభివృద్ధి చెందడం లేదా, చైనా-జపాన్ టాప్ పొజిషన్‌లో లేవా అని. ఇప్పటికైతే.. ధనిక దేశాల జాబితాలో చైనా, జపాన్ సెకండ్ అండ్ థర్డ్ పొజిషన్‌లో ఉన్నాయి. కాని, చైనా, జపాన్ ఆర్థికవ్యవస్థల స్పీడ్ మెల్లమెల్లగా తగ్గుతూ వస్తోంది. కారణం.. యూత్ లేకపోవడమే. ఎప్పుడైనా సరే.. కొత్త టెక్నాలజీని అడాప్ట్ చేసుకునేదే యూత్. కొత్త టెక్నాలజీతో వచ్చే వస్తువులను కొనేదే యువత. వాళ్లే లేటెస్ట్ టెక్నాలజీ వెంట పడకపోతే.. ఇక వాటిని తయారు చేయాల్సిన అవసరం ఏంటి? అదే జరిగితే.. కొత్తగా కనిపెట్టడం కూడా అనవసరమే కదా. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, లేటెస్ట్ ఇన్నోవేషన్స్ అన్నీ దండగేగా. అందులోనూ యూత్‌లో రిస్క్ తీసుకునే కల్చర్ ఎక్కువగా ఉంటుంది. స్టార్టప్ కావొచ్చు, మరేదైనా బిజినెస్ కావొచ్చు.. రిస్క్ తీసుకుని ముందుకు వెళ్తేనే ప్రాఫిట్స్ వస్తాయి. అమ్మో రిస్క్ ఎందుకు అని భయపడితే.. అలాగే ఉండిపోతారు. సో, యూత్ లేని దగ్గర ఈ రిస్క్ కల్చర్ తగ్గిపోతుంది. అదే జరిగితే.. ఎకానమీపై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఈ ప్రపంచంలో రెండు రకాల ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయి. ఒకటి సేవింగ్ ఎకానమీ, రెండోది స్పెండింగ్ ఎకానమీ. నిన్న మొన్నటి వరకు ఇండియాది సేవింగ్ ఎకానమి. వచ్చిన దాన్లో ఎంతో కొంత దాచుకోవడమే చూశాం. ఇప్పుడు భవిష్యత్‌పై భయం పోయింది. ఎప్పుడేం జరుగుతుందోనన్న భయం లేదిప్పుడు. సో, దాచుకోవడం తగ్గించి కాస్త ఎక్కువ ఖర్చు చేయడం మొదలుపెడుతున్నాం. అమెరికాది ప్యూర్‌గా స్పెండింగ్ ఎకానమి. అక్కడ ఐదు రోజుల పాటు సంపాదించిన డబ్బుని వీకెండ్‌లోని రెండు రోజుల్లో ఖర్చు పెట్టేస్తారు. కారణం.. సోమవారం నుంచి మళ్లీ చేతిలో డబ్బులు పడతాయనే భరోసా. అమెరికా సహా యూరప్ దేశాలది స్పెండింగ్ ఎకానమీస్ కాబట్టే.. రెండు ప్రపంచ యుద్ధాలను ఫేస్ చేసిన తరువాత కూడా అంతే ఫాస్ట్‌గా డెవలప్ అయ్యాయి. అమెరికాను పక్కన పెడితే యూరప్ దేశాలు, జపాన్ ఇప్పటికీ స్పెండింగ్ ఎకానమీసే. కాకపోతే.. అక్కడ కొనే యూత్ లేరు. వృద్ధుల సంఖ్య పెరిగిపోవడంతో.. ఉన్న దాంతోనే సంతృప్తిపడడం ఎక్కువైపోయింది. సో, ఖర్చు పెట్టడం తగ్గిపోయింది. ఎక్కడైతే ఖర్చుపెట్టడం తగ్గుతుందో, ప్రొడక్ట్స్ సేల్స్ తగ్గుతాయో.. ఇక ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుచించుకుపోతున్నట్టే అర్థం. ప్రస్తుతం జపాన్‌లో ఆ పిరియడే నడుస్తోంది. చైనాలో త్వరలో అలాంటి సిచ్యుయేషన్ రాబోతోంది. ఇక ఫిన్లాండ్. ప్రపంచంలోనే ప్రజలు అత్యంత సంతోషంగా ఉన్న దేశాల్లో టాప్‌లో ఉంటుందది. నేరాలు లేని దేశం కూడా. ఎంత సంతోషమయమైన దేశం అయితే మాత్రం ఏం లాభం..! యూత్ లేరక్కడ. యునైటెడ్ నేషన్స్ ప్రకారం 2030 నాటికి ఫిన్లాండ్ దేశంలోని 47 శాతం మందికి పైగా ప్రజలు 65 సంవత్సరాలు దాటుతారు. అంటే.. దేశంలో సగానికి సగం వృద్ధులే. ప్రపంచ మొత్తం మీద జపాన్ తర్వాత 65 సంవత్సరాలు దాటిన వారు ఎక్కువగా ఉన్న దేశం ఫిన్లాండ్. ఇక కొరియా కూడా టెక్నాలజీలో అప్‌గ్రేడెడ్ కంట్రీనే. అక్కడ కూడా యూత్ తగ్గిపోతోంది. యూత్ తగ్గుతోంది అనడం కంటే.. అసలు పిల్లల్ని పెద్దగా కనడమే లేదు అని చెప్పుకోవాలేమో. ముగ్గురు చనిపోతుంటే ఒకరు పుడుతున్నారు. కొరియాతో పాటు జపాన్, చైనాలోనూ పెళ్లి, పిల్లలపై ఇంట్రస్టే కనిపించడం లేదు అక్కడి యువతకి. ఏమంటే.. సోలో బ్రతుకే సో బెటర్ అంటున్నారు. పెళ్లి చేసుకుంటే.. ఫ్యామిలీ బర్డెన్ మోయాలి, వాళ్ల కోసం కష్టపడాలి, ఇంకాస్త ఎక్కువ సంపాదించాలి అనే మెంటల్ స్ట్రెస్‌లో ఉన్నారు. సో, సింగిల్‌గా ఉన్నంత ఉత్తమం లేదనుకుంటున్నారు. అక్కడి ఆడవాళ్లు కూడా అదే మైండ్‌సెట్‌తో ఉన్నారు. పిల్లల్ని కనాలి, ఫ్యామిలీని చూసుకోవాలి, బండెడు చాకిరీ చేయాలి. అదే పెళ్లి చేసుకోకపోతే.. లైఫ్ అంతా సింగిల్‌గా ఉంటూనే ఎంజాయ్ చేయొచ్చు అని ఫీలవుతున్నారు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే.. చైనా, జపాన్‌లో ఇప్పుడు కనిపిస్తున్న డెవలప్‌మెంట్ అంతా ఆగిపోతుంది. అభివృద్ధి తగ్గిపోతుంది కూడా. ఎందుకంటే.. టెక్నాలజీపైనా, రీసెర్చ్‌పైనా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పైనా పెట్టాల్సిన ఇన్వెస్ట్‌మెంట్‌ని.. భవిష్యత్తులో హాస్పిటల్స్ కోసం, ఓల్డ్ ఏజ్ హోమ్స్ కోసం, వారికి ఇవ్వాల్సిన పెన్షన్స్ కోసం, హెల్త్‌కేర్ సిస్టమ్ కోసం పెట్టాల్సి వస్తుంది. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే స్లోగన్ వస్తోంది.. నిన్న చంద్రబాబు.. ఇవాళ స్టాలిన్ పిల్లలను కనండి అంటూ కామెంట్స్ చేసేస్తున్నారు. దక్షిణ భారతదేశంలో మధ్య వయసు వాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారిప్పుడు. 2047 నాటికి.. వీళ్లంతా వృద్ధుల జాబితాలోకి వెళ్తారు. సంతానోత్పత్తి రేటులో జాతీయ సగటు 2.1 ఉంటే.. సౌత్ ఇండియాలో సంతానోత్పత్తి రేటు 1.6కి పడిపోయింది. అంటే.. ఏపీతో సహా దక్షిణాదిన వృద్ధాప్య సమస్య సంకేతాలు కనిపించడం మొదలైందన్నమాట. ప్రస్తుతం ఇండియాలో యూత్ ఎక్కువగా ఉన్నారు కాబట్టి ఇప్పటికిప్పుడు వచ్చిన సమస్యేం లేదు. మన దగ్గరున్న యూత్ సగటు వయసు 29 సంవత్సరాలు. ప్రపంచంలో మరే దేశంలో లేని యూత్ ఇండియాలోనే ఉన్నారు. 2047 వరకు జనాభాపరంగా, యూత్ పరంగా మనకొచ్చిన ఇబ్బందేం లేదు. మరో పాతికేళ్ల వరకు ఇప్పుడున్న యువతే దేశాన్ని నడిపిస్తుంది. మరి ఆ తరువాత..? ఇప్పుడు యావరేజ్‌గా 29 ఏళ్లున్న వాళ్లు పాతికేళ్ల తరువాత రిటైర్మెంట్‌కు దగ్గరపడతారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణం సందర్భంగా మెగా రక్త దాన శిబిరం

**- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్**
**- పోలీసు అమర వీరుల త్యాగాలు, చిరస్మరణీయం**






వనపర్తి జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లాలోని పోలీసు అధికారులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, కొత్తకోట ఎస్సై, మంజునాథ్ రెడ్డి, పెద్దమందడి ఎస్సై, యుగంధర్ రెడ్డి, ఆత్మకూరు ఎస్సై,నరేందర్. అమరచింత ఎస్సై, సురేష్, చిన్నంబావి ఎస్సై, రమేష్, జిల్లా ఎస్పీ పి ఆర్ ఓ, రాజా గౌడ్, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని స్వచ్ఛందంగా 123 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. సమాజం కోసం,దేశం కోసం,రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెలకట్టలేమన్నారు. ప్రతీ ఒక్కరూ పోలీసు అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు. వారి త్యాగ ఫలితమే మనమంతా ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నామని అన్నారు. పేదప్రజలు,బాధితులకు సత్వర న్యాయం అందించడం, ధర్మం పక్షాన నిలిచి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసినప్పుడే వారి త్యాగానికి మనమందించే ఘనమైన నివాళి అని తెలిపారు. అమ్మ జన్మనిస్తే రక్తదానం పునర్జన్మనిస్తుందని అన్నారు. ఒక్క రక్తదానంతోనే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం సాధ్య మవుతుందన్నారు. థలసేమియా, క్యాన్సర్, హిమోఫీలియా, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి,ఇతరత్రా జబ్బులతో బాధపడుతున్న వారి కోసం ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని, రక్తదానం చేసి అటువంటి వారి ప్రాణాలను కాపాడటం ద్వారా మనకు కూడా మంచి చేకూరుతుందని అన్నారు. రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దని ఎస్పీ గారు అన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడానికి ఈ శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ఉపయోగపడుతుందని తెలియజేసారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి ప్రతీ 5 నెలలకొకసారి రక్తదానం చేయడం ద్వారా శరీరం మరింత ఉత్సాహవంతంగా మారుతుందని అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

రక్తదానం చేసిన రక్త దాతలకు ఎస్పీ ప్రశంషా పత్రం, పండ్లు పంపిణీ చేశారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా 123 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందని, సేకరించి రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు అందజేయడం జరిగింది. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన అధికారులకు,సిబ్బందికి, యువకులకు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులకు, విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజా సంఘాల నాయకులకు వనపర్తి జిల్లా,పరిసర ప్రాంతాల ప్రజలకు ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ, రాందాస్ తేజవత్, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ, ఎం,క్రిష్ణ , ఆత్మకూరు సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, నరేష్ ,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి జిల్లా రెడ్ క్రాస్ ప్రధాన కార్యదర్శి, కృష్ణ సాగర్, వైస్ చైర్మన్, సయ్యద్ కలాం పాషా, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు,గోనూరు యాదగిరి, అహ్మద్,శ్యామ్, ప్రభుత్వ ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది, లక్ష్మీపతి, రమేష్, మహమూద్, సంతోష్, లక్ష్మి, రెడ్ క్రాస్ సిబ్బంది, మరియు విద్యార్థులు, మహిళలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పత్రికా మీడియా మిత్రులు జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

# వేకం కన్నం ప్రాణం మిన్న

**- ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి**
**- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు, అలాగే ఇతర రహదారులపై ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను పోలీసు, ఇంజనీరింగ్ అధికారుల సంయుక్త బృందాలు తనిఖీ చేసి సమర్పించిన నివేదిక ఆధారంగా, ప్రత్యేకించి పోలీసు అధికారుల సూచనలను మేరకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వర్షాల వల్ల గుంతలు పడిన అన్ని రహదారులను వెంటనే మరమ్మతులు చేయించాలని, అలాగే రహదారుల మలుపుల వద్ద ముళ్ళపొదలు, చెట్ల కొమ్మల వల్ల ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఉన్న వాటిని గుర్తించి తొలగించాలని కలెక్టర్ సూచించారు. అలాగే జాతీయ రహదారులపై అనధికారిక రోడ్డు క్రాసింగ్ లను మూసివేయాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే గ్రామాలలో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేయాలని, పోలీస్ కళాజాత, కళాజాత ద్వారా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, కళాజాత తో పాటు, మెడికల్ బృందం ,పోలీస్, రెవెన్యూ ఇతర బృందాలతో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై తోపాటు, ఇతర రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాలపై సైతం రహదారుల అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు కలిసి పనిచేయాలన్నారు. దెబ్బతిన్న ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్ల గుంతలుపూడ్చడం,ముళ్ళపోదలు ,చెట్ల కొమ్మలు తొలగించడం పూర్తి చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలాన్నారు. క్రమం తప్పకుండా వాహనాల తనిఖీ నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో ఆటోలు, బస్సుల వివరాలు సేకరించి, ఆ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి రూల్స్ ప్రకారం ప్రయాణించుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథన్ కెకన్ మాట్లాడుతూ జిల్లాలో (20) బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో అన్ని రహదారులపై తనిఖీ నిర్వహించి ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, సబ్ ఇన్స్పెక్టర్లు సహకారంతో స్పీడ్ బ్రేకర్లు, లైట్లు, స్టాపర్స్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, వీటన్నిటిని ఏర్పాటు చేసిన తర్వాత ప్రమాదాల సంఖ్య తగ్గిందని తెలిపారు.

జిల్లా మొత్తం కవర్ చేయడం ద్వారా బ్లాక్ స్పాట్స్ లో ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఆర్ అండ్ బి ,పంచాయతీరాజ్, ఇతర శాఖల ఇంజనీరింగ్ అధికారులు రోడ్లపై ముళ్లపోదలు, చెట్ల కొమ్మల వల్ల ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నవి గుర్తించి వాటిని తొలగించాలని, అలాగే అవసరమైన చోట వెలుతురు ఉండేలా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే చికిత్స అందించి ప్రాణాలు కాపాడేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, రహదారుల ఇంజనీరింగ్ అధికారులు సంయుక్త తనిఖీల సందర్భంగా గుర్తించిన బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థలు, రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, ఆర్అండ్బి ఈఈ భీమ్లనాయక్, డిర్టీవో జైపాల్ రెడ్డి, ఆర్టిఓ సాయి కిరణ్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వేంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మురళీధర్, మున్సిపల్ డిఈ ఉపేందర్, నేషనల్ హైవే డిఈ అమీర్, బషీర్, కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు

**- సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం**
**- హెచ్చరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, ఆరోగ్య కేంద్ర సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే బాధ్యత ప్రతి వైద్య సిబ్బందిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించే విధంగా బయో మెట్రిక్ హాజరు తీసుకునే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలో సమయ పాలన పాటించనట్లు గుర్తించిన వైద్యాధికారి డా నిహారిక, స్టాఫ్ నర్సు జి.సంధ్యారాణి, ఫార్మసిస్ట్ వి.చైతన్య, సహాయక సిబ్బందికి, అలాగే ఓపి ఏఎన్ఎం లకు తక్షణమే షో కాజ్ నోటీస్ జారి చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. భవిష్యత్తులో ఏదేని ఇలాంటి సంఘటనలు జరిగితే విధుల నుండి శాశ్వతంగా తొలగిస్తామని ఆయన హెచ్చరించారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

**పెద్ద ఎత్తులో పాల్గొనాలని జిల్లా ఎస్పీ పిలుపు**
**జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపిఎస్**



ములుగు జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా రేపు అనగా 24-10-2024 ఉదయం 10:30 నిమిషాలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరగనున్నదని ఎస్పీ గారు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి జిల్లా పోలీసులు మరియు ఆసక్తిగల యువత ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడం జరుగుతున్నది. మరొకరి ప్రాణాలు కాపాడడంలో తమ వంతుగా రక్తదానం చేసిన వారికి జిల్లా ఎస్పీ చేతుల సర్టిఫికెట్ జారీ.

# సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శిగా నగేష్ ఏకగ్రీవం



నేరేడుచర్ల, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శిగా కొదమగుండ్ల నగేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మంగళవారం దిర్శించర్ల గ్రామంలో జరిగిన ఆ పార్టీ పట్టణ మహాసభలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే రోజుల్లోనే విద్యార్థి సమస్యలపై ఆందోళన పోరాటాలు నిర్వహించి ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో డివిజన్, జిల్లా నాయకునిగా ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం తర్వాత కాలం సిపిఎం నేరేడుచర్ల శాఖ కార్యదర్శిగా పనిచేయడం జరిగిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం హుజూర్ నగర్ మిర్యాలగూడ డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తూ, కార్మిక సమస్యలపై కూలీ, భూమి, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుకు పోరాటాలు నిర్వహించి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా, పూర్తి కాలం సిపిఎం పార్టీ కార్యకర్తగా నేటికీ కొనసాగుతున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత సిపిఎం పార్టీ 2016లో నిర్వహించిన సిపిఎం మహాజన పాదయాత్రలో సభ్యునిగా ఆరు నెలల కాలంలో 4200 కిలోమీటర్లు రాష్ట్రం మొత్తం తిరిగి, రాష్ట్రంలో ప్రజల స్థితిగతులు వారి సమస్యలు తెలుసుకోని తర్వాతి కాలంలో ప్రజా పోరాటాలు నిర్వహించామన్నారు. సిపిఎం పట్టణ మహాసభలో కార్యదర్శి గా ఎన్నుకున్న ప్రతినిధులకు, కమిటీ సభ్యులకు, ప్రజలను కలుపుకొని రానున్న కాలంలో నేరేడుచర్ల పట్టణంలో పేదల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం రానున్న కాలంలో పట్టణ పరిధిలోని అన్ని గ్రామాలకు ఆవాస గ్రామాలకు విస్తరించే విధంగా కృషి చేస్తామని కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతామన్నారు.

# రక్తదానం చేసిన ఎస్ఐ నరేందర్



ఆత్మకూర్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): అమరవీరుల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా ఈరోజు వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్, ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్ లో పాల్గొని ఆత్మకూరు ఎస్సై నరేందర్ కానిస్టేబుల్ లు క్రాంతి, భీమయ్య లు రక్త దానం చేయడం జరిగింది. ఇట్టి రక్తదాన శిబిరంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. అదేవిధంగా ఆత్మకూరు మండలం నుంచి కూడా సుమారు 6 మంది యువత ఇట్టి కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయడం జరిగింది.

# బకాయిలు చెల్లించక పేద విద్యార్థులు

## చదువులకు దూరం:ఏఐఎస్ఎఫ్

వనపర్తి జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం కళాశాలల విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, ఉపకార వేతనాల బకాయిలు చెల్లించకపోవడంతో, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాల విద్యార్థులు కళాశాల చదువులకు దూరం అవుతున్నారని, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ రమేష్, జిల్లా అధ్యక్షుడు నరేష్ విమర్శించారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద కళాశాల విద్యార్థులతో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ముందుగా వనపర్తి కొత్త బస్టాండ్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాల బకాయిలు రూ. 7600 కోట్లు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగిన ధర్నా సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ రమేష్, జిల్లా అధ్యక్షుడు నరేష్, ఏఐటీయూసీ నేతలు శ్రీరామ్, గోపాలకృష్ణ మాట్లాడారు. పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాల పైన ఆధారపడుతున్నారన్నారు.గత ఐదేళ్లుగా బకాయిలు విడుదల చేయక పోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. పాసైన విద్యార్థులు పై చదువులకు వెళ్లేందుకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వటం లేదన్నారు. ఇటీవల 1560 కోట్లు విడుదల చేస్తామనిప్రభుత్వం చెప్పిన




ఇంతవరకు పైసా ఇవ్వలేదన్నారు.గత ప్రభుత్వ పద్ధతినే ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తుందని ఇది సరికాదన్నారు. వెంటనే బకాయిలు చెల్లించకుంటే విద్యార్థులకు సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ఆఫీసులో ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థి నాయకులు అరవింద్, భాను ప్రకాష్, చరణ్, గణేష్, జస్వంత్, బన్నీ, శివ యాదవ్, శివ ,భాను తదితరులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు వద్దు రాజ్యాంగమే ముద్దు

**– మల్లు నాగార్జున రెడ్డి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి**

నేరేడుచర్ల, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): జమిలి ఎన్నికలు వద్దని రాజ్యాంగమే ముద్దని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముకుందాపు జిల్లారం గ్రామంలో జరిగిన సిపిఎం పార్టీ మండల మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నమూనాలు అమలు జరిపితే రాజ్యాంగం యొక్క పునాదులైన ప్రజాస్వామ్యం సమైక్య విధానాలు దెబ్బతింటాయని, రాజ్యాంగం యొక్క మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని, కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాటు రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కూడా ఒకేసారి నిర్వహించడం అంటే అది కొన్ని శాసనసభల కాలపరిమితిని కుదించబడేందుకు దారితీస్తుందని, రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోవడం జరుగుతుందన్నారు. ఒక రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయి శాసనసభ రద్దు చేయాల్సివస్తే, మిగిలిన కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నిక నిర్వహించబడుతుందని, రాజ్యాంగంలో ప్రజలు ఐదేళ్ల కాలానికి తమ ప్రతినిధుల్ని ఎన్నుకునే హక్కు పోంద పరచబడిందని, జమిలి ఎన్నికల ప్రతిపాదనలపై కొవింద్ సిఫారసుల వలన ఈ హక్కు ఉల్లంఘన గురవుతుందన్నారు. పంచాయతీలు మునిసిపాలిటీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న




ప్రతిపాదనతో సమైక్య విధానంపై దాడి మరింత స్పష్టం అవుతుందన్నారు. అందువలన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడం ద్వారా జమిలి ఎన్నికలు తేవాలన్న కృత్రిమ ప్రయత్నాన్ని భారత కమ్యూనిస్టు పార్టీగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజాస్వామ్యం బహుళత్వం సమాఖ్య విధానాన్ని కోరుకునే ప్రతి పార్టీ దీన్ని బహిరంగ గానే వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. మామిడి నాగ సైదులు బొప్పన రానమ్మ అధ్యక్షులుగా జరిగిన ఈ మహాసభలో గంగా రాధమ్మ పతాక ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖరావు, నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్, దుగ్గి బ్రహ్మం, సిరికొండ శీను, మర్రి నాగేశ్వరరావు, పర్సనబోయిన సైదులు, అల్వాల శ్రీధర్, మామిడి జానకిరాములు, బుడిగె ధనుంజయ, కట్ట మధు, చలసాని అప్పారావు, మడుపు దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటివారైనా శిక్ష తప్పదు

**బి.హరిప్రసాద్ ఎస్ఐ టౌన్ వనపర్తి**

వనపర్తి జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటి వారైనా శిక్ష తప్పదని వనపర్తి టౌన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ బి.హరిప్రసాద్ హెచ్చరించారు. గోపాల్ పేట్ లో ఎస్సైగా విధులు నిర్వహించి, బదిలీపై వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చిన, ఎస్సై బి.హరిప్రసాద్, మంగళవారం రోజు జిల్లా పోలీసు ప్రధాన కేంద్రంలో ఎస్పీ రావుల గిరిధర్ గారిని తన చాంబర్లో మర్యాదపూర్వకంగ కలిసి పూల మొక్క అందజేయడం జరిగింది. అలాగే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డిని తిరుమల హిల్స్ లోని, మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ బి.హరిప్రసాద్ మాట్లాడుతూ, కన్నీళ్లతో, పోలీస్ స్టేషన్ కు వచ్చే, ప్రజలకు పోలీసులు ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్లుగా కనిపిస్తారని ఎస్ ఐ అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు, ధైర్యం చెప్పి, వారి సమస్యకు సత్వరమే, న్యాయం అందించినప్పుడే పోలీస్ లపై నమ్మకం, విశ్వాసం కలగడమే కాక, గౌరవం పెరుగుతుందని సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికి చిత్తశుద్ధితో, నిజాయితీగా నిస్పక్ష పాతంగా కర్తవ్యలను నిర్వహించాలని ఎస్ ఐ సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సిబ్బందికి సూచించడం జరిగింది. పి ఎస్ లో పెండింగ్ లో, ప్రధాన కేసుల దర్యాప్తు వాటి పురోగతి పై సమీక్షించారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే, రోడ్ ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఐ అన్నారు. అర్హత లేని వాహనాలపై ఉండే ప్రెస్, పోలీస్, ఇతర శాఖల పేర్లు తొలగించాలని, ప్రతి ఒక్క వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకుండా, వెళ్లి దారిలో కొందరు ఇష్టా రాజ్యాంగ డ్రైవ్




చేయడం సరి కాదన్నారు. వాహనాన్ని డ్రైవ్ చేస్తున్నప్పుడు పక్కవారికి ఇబ్బంది కలిగించే విధంగా చేస్తున్నారని, అలాంటి వాహనాలు తనిఖీలో పట్టుబడితే కేసు నమోదు చేసి, వాహనం సీజ్ చేస్తామని ఎస్ఐ అన్నారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లను రవాణాశాఖ సూచించిన విధంగానే ఉండాలని, తమకు ఇష్టం వచ్చిన రీతిలో నెంబర్ ప్లేట్లు రాసుకొని, కనబడకుండా మార్చుకుంటున్నారని ఇలా చేయడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. మీ చుట్టుపక్కల, మీ పరిసర ప్రాంతాల్లో, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర సమయంలో పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 100 కు సమాచారం ఇవ్వాలని, లేదా వనపర్తి పట్టణ ఎస్సై బి.హరిప్రసాద్ సెల్ నెంబర్: 8712670612 కు, సమాచారం ఇవ్వాలని వనపర్తి టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.హరిప్రసాద్ అన్నారు.

# ప్రజలకు చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలి

**– గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**– ప్రతి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి**

**– జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్**



మక్తల్, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని,గ్రామాల్లో విజబుల్ పోలీసింగ్, నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నర్వ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ బుధవారం రోజు వార్షిక తనిఖీల్లో భాగంగా నర్వ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో నమోదు అవుతున్న కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో సిడి ఫైల్స్, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించి, కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. స్టేషన్ రికార్డ్స్ , వర్టికల్స్ అమలు తీరు, స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సి.డి ఫైల్స్ లను స్టేషన్లో ఎక్కువగా ఏ ఏ కేసులు నమోదు అవుతున్నయని వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో




వెంటనే స్పందించి ప్రతి ఫిర్యాదు పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అనంతరం విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని,విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్సంబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. బ్లూ కోల్ట్ సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, నర్వ ఎస్సై కుర్మయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

**– పథకాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలి**

**– జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు, జిల్లా కలెక్టర్, బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో (డిఐపిసి) జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ టీ - ప్రైడ్ స్కీమ్ ద్వారా జిల్లాలోనీ షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టీ) (12) మందికి రూపాయలు–41, 26,216/– లక్షలు, షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సి) 03, మందికి రూపాయలు –8,47,615/– లక్షలు, మొత్తం 49,లక్షల 73వేల 831/– రూపాయల నిధుల కేటాయింపు కోసం కమిటీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం (15) మంది ఎస్సి,ఎస్టీ, లబ్ధిదారులకు సబ్సిడీ ఋణాల ప్రతిపాదనలు పంపమన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పిఎం విశ్వకర్మ, టీ ప్రైడ్, తదితర సౌకర్యాల ద్వారా జిల్లాలోనియువతీ, యువకులు వ్యాపార రంగాల్లో ప్రవేశించి ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, పౌల్ట్రీ ఫామ్, రైస్ మిల్లు, జేసిబి, లారీలు, చిల్లి వ్యాపారం



తదితర వాణిజ్య వ్యాపారాలు ఉన్నాయని, ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. యువతి,యువకులు, ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సంబధిత అధికారులకు సూచించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న గ్రామాల్లో ప్రజలకు తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఏ.సత్యనారాయణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహా స్వామి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, టీపిఓ సాయిరాం, ఎస్టీ, ఎస్సి, సంక్షేమశాఖల అధికారులు, ఆర్టీవో సాయి చరణ్, సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వివాదాలకు ఆస్కారం లేకుండా సమచార సేకరణ చేయాలి

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్**

ములుగు జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా అన్ని వర్గాల ప్రజల సమగ్ర సమచార సేకరణ చేయాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి అన్ని వర్గాల సమగ్ర కుటుంబ సమాచార సేకరణపై ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్వహించనున్న ప్రజాభి సేకరణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సమీక్షలో అన్ని వర్గాల కుటుంబ సమగ్ర సమాచార ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి నవంబర్ 2వ తేదీన హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజాల నుండి గణనపై విజ్ఞాపనలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతిఒక్కరు తమ విజ్ఞాపనలు చైర్మన్ పిలుపునిచ్చారు. ప్రజల నుంచి వచ్చే అన్ని అభ్యంతరాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని, కుటుంబ సమాచార సేకరణ ప్రక్రియలో ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితి గతులపై సమగ్ర సమచారం సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్లకు ఈ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి,




నిష్పక్షపాతంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫెరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం అన్ని కులాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని బిసి సంక్షేమ అధికారిని ఆదేశించారు. అన్ని కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలపై నవంబర్ 2వ తేదీన హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమిషన చైర్మన్ నిరంజన్ నిర్వహించే. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనే విధంగా ప్రజా ప్రతినిధులకు, మేధావులు, వివిధ కుల సంఘాల నాయకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జనగామ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): అన్ని సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బీసీ కమిషన్ చైర్మన్ సి నిరంజన్ తెలిపారు. బుధవారం హైదరాబాదులోని బీసీ కమిషన్ కార్యాలయం నుండి బిసి కమిషనర్ సభ్య కార్యదర్శి బాలమాయ దేవి అధ్యక్షతన గూగుల్ జూమ్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయము నుండి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఇది అన్ని వర్గాలకు చెందిన సర్వే అని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ రెండవ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హన్మకొండ కలెక్టరేట్లో పార్లమెంట్ సభ్యులు శాసనమండలి సభ్యులు శాసనసభ్యులు పాల్గొనే విధంగా ముందస్తు సమాచారాన్ని ఇచ్చి ఏర్పాట్లు చేపట్టాలన్నారు.



దరఖాస్తు చేసేవారు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాటును ఇవ్వడం జరుగుతుందని వాటిని ఒక్కొక్కరు ఐదు సెట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అందుకు తగిన విధంగా హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాలలో సామాజిక ఆర్థిక రాజకీయ విశ్లేషణ సర్వే పై అవగాహన పరచాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జనగామ జిల్లాకు చెందిన వివిధ సామాజిక వర్గాల వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్ ను సమగ్రంగా పూరించి 5 సెట్లను హన్మకొండ కలెక్టరేట్ లో నవంబర్ రెండవ తేదీ న సమావేశం ఉదయం 10 గంటల నుండి నాలుగు గంటల వరకు నిరంతరంగా కొనసాగుతుందని, దరఖాస్తులను బి.సి.కమిషన్ కు అందజేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో బీసీ సంక్షేమ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

# ప్రజల సమగ్ర సమచార సేకరణ చేయాలి

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్**

వరంగల్ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజల సమగ్ర సమచార సేకరణ చేయాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి అన్ని వర్గాల సమగ్ర కుటుంబ సమాచార సేకరణపై ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్వహించనున్న ప్రజాభి సేకరణపై జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పాల్గొన్నారు. ఈ సమీక్షలో అన్ని వర్గాల కుటుంబ సమగ్ర సమాచార ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి నవంబర్ 2వ తేదీన హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ వర్గాల ప్రజల నుండి గణనపై విజ్ఞాపనలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజల నుంచి వచ్చే అన్ని




అభ్యంతరాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని, కుటుంబ సమాచార సేకరణ ప్రక్రియలో ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితి గతులపై సమగ్ర సమచారం సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్లకు ఈ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్త కుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, నిష్పక్ష పాతంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫెరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ అన్ని కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలపై నవంబర్ 2వ తేదీన హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమిషన చైర్మన్ నిరంజన్ నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనే విధంగా ప్రజా ప్రతినిధులకు, మేధావులు, వివిధ కుల సంఘాల నాయకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): ఖరీఫ్ 2024-25 వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం 2024 - 25 ధాన్యం కొనుగోళ్ల పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మద్దత్తు ధర క్వింటాల్ గ్రేడ్ %-%ఎ రకానికి రూ 2320 /- సాదారణ రకానికి రూ.2300 /- మరియు సన్న రకానికి అదనంగా రూ 500 /- చెల్లించడం జరుగుతుందని అన్నారు. కొనుగొలు కేంద్రాల యందు సన్న ధాన్యం, దొడ్డ ధాన్యం వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రం లో సన్న దాన్యం నింపు గొనె సంచులకు ఎర్ర దారం తో కుట్టి వేయాలని, "%వా% " అనే అక్షరం ముద్రించాలని, దొడ్డ దాన్యం నింపు గొనె సంచులకు ఆకుపచ్చ దారం తో కుట్టి వేయాలని, సన్న దాన్యం దొడ్డ దాన్యం వేర్వేరు లారీలలో నింపి రైస్ మిల్లులకు రవాణా చేయాలనీ తెలిపారు. జిల్లాలో మొత్తం 178 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో 162 సన్నరకం ధన్యం కొనుగోలు కేంద్రాలు, మిగతావి దొడ్డ రకం ధన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. రెండు ఒకే కేంద్రం లో కొనుగోలు చేయడం కుదరదని అన్నారు. వరి ధాన్యం



సేకరణ కేంద్రాల వద్ద త్రాగునీరు, టెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. వరి సేకరణ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పౌరసరఫరాల అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేసి వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో తేమ మిషన్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని, అదేవిధంగా గోనె సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండ వరి దాన్యం సేకరణ జరగాలని అన్నారు.

ఈ సందర్బంగా వరి కొనుగోలు కేంద్రాల లో సన్న రకం, దొడ్డ రకం ఏ విదంగా గుర్తించాలనే విధానం అవగాహన కల్పించారు. అలాగే కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వ నిర్దేశించిన ఎఫ్ఎక్యూ ప్రమాణాలను అనుసరించి కొనుగోలు చేయాలని రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ఏమైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు విషయంలో మరియు మిల్లులకు ధాన్యం తరలించే అంతవరకు ఏమైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ వానాకాలం ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు తలెత్తిన రైతులు లేదా ఇతరులు ఈ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన, 24 గంటలు పని చేసే ఫోన్ నెంబర్ 9347416178 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో సైతం ధాన్యం సేకరణ, కొనుగోలు కు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1 9 6 7 లేదా 180042500333 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, జిల్లా కోపరేటీవ్ అధికారి సర్దార్ సింగ్, %ణజూా% షా ఫైజుల్ హుస్సేనీ, %ణవీజూ% రాం పతి, ఎఫ్ సి ఐ డివిజనల్ మేనేజర్ ప్రకార్ వర్మ జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, ఎం వి ఐ కిషోర్ బాబు, ఎల్డి ఎం జయ ప్రకాష్, తహసీల్దార్లు, ఐకెపి జిసిసి లీగల్ మెట్రాలజీ కార్మిక శాఖ రవాణా శాఖ రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వివిధ సెంటర్ ఇన్చార్జిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు



నేరేడుచర్ల, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): స్థానిక నేరేడుచర్ల మండలలో ప్రభాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల లోని వెంకటరమణ సినిమా థియేటర్ లో కేక్ కట్ చేసి అనంతరం పోస్ట్ ఆఫీస్ దగ్గర వృద్ధులకి పండ్లు పంపిణి చేసినారు. ఈ సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ మండల అధ్యక్షులు కాల్వ సైదులు నాయుడు మాట్లాడుతూ తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన స్టార్ ప్రభాస్ అని కొనియాడారు.కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అజయ్, విజయ్, రామకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, మురళి, ఉదయ్, కర్ణాకర్, అశోక్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి



పరకాల, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): పరకాల నియోజకవర్గం పరకాల పట్టణం, మండల పరిధిలోని పదిమంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం రోజున పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హనుమకొండలోని తన నివాసంలో అందజేశారు. పరకాల చెందిన లబ్ధిదారులు టీ.కళావతి, డి.నిర్మల, వి.ప్రభాకర్, జే. రాజేశ్వరి, బి.సిద్ధు, కే. సుధాకర్, ఎం.సుధాకర్, కె.వీరభద్రయ్య, టి.శంకరయ్య, పి.రాజమౌళి, ఎండి సోహైల్ అలీ, టీ.కనకలక్ష్మి, ఎం.రాజు ,కే.సంతోష్ లకు చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, బొచ్చు శ్రీధర్, దార్న వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): డిసిసిబి సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సహకార శాఖ అధికారిణి నీరజ ఆధ్వర్యంలో కొనుగోలు సెంటర్ల ఇంచార్జీలకు 2024-25 సంవత్సరం లో నిర్వహించ నున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పై పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ , సివిల్ సప్లై అధికారిని సంధ్యారాణి గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు నష్ట పోకుండా రైతులు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తామన్నారు వరి ధాన్యం కొనుగోలు లో గతంలో కంటే ఈ సారి ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ గా 500 చెల్లించే క్రమంలో రైతులు మధ్య దళారులకు అమ్ము కాకుండా ఎక్కువ మొత్తం ప్రభుత్వ కొనుగోలు సెంటర్లకు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాల పనిచేసి సిబ్బందిని పెంచుకొని కొనుగోలు సెంటర్లలో వేరువేరుగా సన్న రకం దొడ్డ రకంకు వేరు వేరును ఏర్పాటు చేయడం జరుగుతుందని అందుకు సెంటర్ నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 17 శాతం లోబడి ఉన్న తేమ ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాల వల్ల ఏ ఒక్క



ధాన్యం గింజ తడవకుండా ఉండేందుకు టార్పాలిన్, ధాన్యాలను తూకం కొలచే యంత్రాలు, తేమశాతం చూసే యంత్రాలు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 రకాల సన్న రకాల వరి ధాన్యాలకు గానూ మన జిల్లాలో 10 నుండి 12 రకాల వరి ధాన్యాన్ని మాత్రమే రైతులు పండించారని, రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని గుర్తించుటలో ప్రావీణ్యం కలిగి ఉండాలని సెంటర్ ఇన్చార్జిలను ఆదేశించారు. రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించి ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను ముందుగానే గ్రామపంచాయతీలలో, ముఖ్య కూడలిలో, రచ్చబండ లలో టాంటాములు వేయించి రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. అకాల వర్షాలు వచ్చినట్లయితే ఒక్క దాన్యాయం గింజ కూడా తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముందుగానే ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సమస్య రాకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవలసిన బాధ్యతను కలిగి ఉండాలని ఈ సందర్భంగా వారికి గుర్తు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినట్లు ఐతే గుర్తించుటకు వీలుగా కొనుగోలు కేంద్రానికి ఒక్కొక్క సెంటర్ కి ఒక్కొక్క నెంబర్ ఉంటుందని, సెంటర్ నెంబర్ ఆధారంగా ఏ సెంటర్లో ధాన్యం సేకరించినట్లు తెలుస్తుందని తెలియజేస్తూ , ప్రభుత్వ నిబంధనల మేరకు తాలు,తేమ శాతం, ఉన్న ధాన్యాన్ని సేకరించాలని అందుకు భిన్నంగా సేకరించిన సెంటర్ ఇంచార్జీ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా అతను కలెక్టర్ సెంటర్ ఇన్చార్జిలను ఆదేశించడమైనది. ఒక్కొక్క కొనుగోలు సెంటర్ కి ఒక్కొక్క ఐడి నెంబర్ తో పాటు, రైతు ఐడి నెంబర్ అని గన్ని లా పై స్టెన్సిల్ తో మార్క్ చేయవలసి ఉంటుందని సన్న వద్ద గన్నికి ఎరుపు రంగు దారంతో, దొడ్డ రకం వద్ద గన్ని కి పచ్చ రంగు దారంతో కుట్టి వేరు వేరుగా ఉండేలా చూడాలని అన్నారు. గన్ని బ్యాగ్లు సరిపడా లేనట్లు అయితే ముందే గుర్తించి ఇండెంట్ పెట్టుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల సెంటర్ ఇన్చార్జీలు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి రానున్న ధాన్యం వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గ్రేయిన్ క్యాలిపర్ యంత్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, డిఆర్డివో నాగ పద్మజ, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో బాబు, సివిల్ సప్లై డీటీలు నాగేంద్ర ప్రసాద్, రమేష్, ఇతర అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విజయోస్తు

- పదిలో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యం
- పరీక్ష ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలి
- 10/10 సాధించేందుకు విద్యార్థులు కష్ట పడాలి
- ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ పెట్టుకోవాలి
- NAS పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత ఫలితాలు వచ్చేలా అలాగే జాతీయ సాధన సర్వేలో జిల్లా కి మంచి ర్యాంక్ వచ్చేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులకి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఒరియేంటేషన్ ప్రోగ్రాం ను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. గత విద్య సంవత్సరానికి



సంబందించి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుండి ఆయా పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించటానికి ఉపాధ్యాయులు ఎలాంటి ప్రణాళిక తో ముందుకు వెళ్ళారో ముందుగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఈ విద్య సంవత్సరంకు సంబందించి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని అన్ని రకాల విద్యాసంస్థల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విజయోస్తు కార్యక్రమం ను రూపకల్పన చేశామని దీని ద్వారా ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఉపాధ్యాయులు ముందుకు పోవాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఆ దిశగా హెచ్ఎంలు, ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వచ్చే నెల మొదటి తారీఖు నుండి పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరగాలన్నారు. డిసెంబర్ నెల చివరి వరకు పదవ తరగతి సిలబస్ అయిపోవాలన్నారు. అభ్యాస దీపిక పుస్తకంలో ఉన్న ప్రశ్నల పైన ప్రతీ శనివారం స్లిప్ టెస్ట్ లు అలాగే గత 5 సంవత్సరాల పరీక్ష పేపర్ ల మీద విద్యార్థులకు ఫిబ్రవరి వరకు టెస్ట్ లు పెట్టాలన్నారు. డిసెంబర్ 10 నుండి మోటివేషన్ తరగతులు నిర్వహించాలన్నారు. అనారోగ్య సమస్య ల వల్ల గైర్హాజరు అయ్యే విద్యార్థుల పేరెంట్స్ తో ప్రత్యేకంగా మాట్లాడుతూ మానటరింగ్ చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను ఆ స్కూల్ లో ఉన్న టీచర్లకు ఇద్దరు, ముగ్గురు విద్యార్థుల చొప్పున అప్పజెప్పి. ఆయా విద్యార్థులు స్కూల్ వస్తున్నారా లేదా వారు ఏ సబ్జెక్ట్ లో వీక్ ఉన్నారు. తదితర అంశాల మీద టీచర్ లు అవగాహన తెచ్చుకొని పరీక్షల సమయం వరకు ఆయా విద్యార్థులు ఇంప్రూవ్ అయ్యేలా చూడాలన్నారు. పరీక్షల్లో అన్ని సమాధానాలు కరెక్ట్ గా రాసినప్పటికి హ్యాండ్ రైటింగ్ సరిగ్గా లేక మార్కులు తగ్గుతున్నాయని అలాంటి విద్యార్థుల హ్యాండ్ రైటింగ్ ఇంప్రూవ్ అయ్యేలా టీచర్ లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చదువుతో పాటు ప్రతీ విద్యార్ధి కి మంచి పౌష్టికహారం అందేలా ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

# స్కూల్ కు బాంబు బెదిరింపులు

రంగారెడ్డి: దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపు కాల్స్ రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఈ వ్యవహారం పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఒకప్పుడు హస్తినకే పరిమితమైన ఈ తరహా బెదిరింపులు, క్రమంగా మిగతా ప్రాంతాలకు వ్యాపిస్తోంది. కేంద్ర స్థాయి సంస్థలను టార్గెట్ చేసినట్టు కనిపిస్తోంది. లేటెస్ట్‌గా దేశవ్యాప్తంగా సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పాఠశాలల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్ ఉదయం జవహర్‌నగర్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలల్లో మంగళవారం ఉదయం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. పాఠశాల పిల్లలను, సిబ్బంది క్షేమంగా వారి వారి ఇళ్లకు తరలించారు. అనంతరం తనిఖీలు ముమ్మరం చేసింది.స్కూల్ లోపలకు ఎవరినీ రాకుండా కట్టుదిట్ట భద్రత చేశారు పోలీసులు. సీఆర్‌పీఎఫ్ అధికారులు, రాచకొండ సీపీ సుధీర్ బాబు, కుషాయిగూడ ఏసీపీ ఆయా ప్రాంతానికి చేరుకుని పరిశీంచారు. బాంబు బెదిరింపులు, మెయిల్స్ రావడంపై సామాన్యులు సైతం మండిపడుతున్నారు.కరెక్టుగా విధులు నిర్వహించకపోవడం వల్లే ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు. రెండు నెలల కిందట ఢిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తింది. స్కూల్, హాస్పటల్, ఎయిర్‌పోర్టులను వదల్లేదు ఆకతాయిలు.మరోవైపు దేశవ్యాప్తంగా విమానాలకు తరచూ బాంబు బెదిరింపులు వస్తున్నాయి. సోమవారం రాత్రి కూడా 30 విమానాలకు బెదిరింపులు వచ్చినట్టు విమానయాన వర్గాలు చెబుతున్నాయి. ఇందులో దేశీయ, అంతర్జాతీయ విమానాలు ఉన్నాయి. దీంతో విమానాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయించి పంపిస్తున్నారు.

# వ్యవసాయ డీలర్లకు దేశీ ధ్రువపత్రాల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 23 (తీన్మార్ న్యూస్): వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన డీలర్లు తప్పనిసరిగా డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఇన్పుట్ (దేశీ) ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం చుంచుపల్లి మండలం రామవరం రైతు వేదిక నందు ఏడవ బ్యాచ్ దేశీ సభ్యుల ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలో 40 మంది వ్యవసాయ, అనుబంధ రంగాల డీలర్లకు దేశీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వీరందరూ 48 వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీనిలో భాగంగా 7వ బ్యాచ్లో జిల్లాలోని 40 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారం చేస్తున్న వారికి దేశీ పేరుతో 12 నెలల డిప్లమో కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయశాఖలో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులు, శాస్త్రవేత్తలతో వారానికి ఒకరోజు




చొప్పున (ఆదివారం) 48 వారాల శిక్షణ ఇస్తున్నామన్నారు. వాతావరణ పరిస్థితులు గురించి భూసార పరిరక్షణకు చేపట్టవలసిన చర్యలను, నీటి యాజమాన్యం గురించి సభ్యులకు కలెక్టర్ వివరంగా తెలిపారు. దేశీ సభ్యులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను రైతాంగానికి తెలియపరచి సేంద్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండించాలని, ఎప్పుడూ ఒకే పంట మీద ఆధారపడకుండా రైతులకు ఎక్కువ ఆదాయం అందించే మునగ, వెదురు, కూరగాయ పంటలైన టమాట, బెండ మరియు దోశ తదితర పంటలను సేంద్రీయ పదార్థాలైన పచ్చి రొట్టె ఎరువులు, బయో ఫెర్టిలైజర్స్ ( జీవన ఎరువులు) ఎక్కువగా వినియోగించి ప్రజలకు ఆరోగ్యమైన పంటలు అందించి తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని అన్నారు. రసాయన ఎరువులు తగ్గించే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధ్రువపత్రాలు అందుకున్న దేశీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ సభ్యులకు మునగ సాగు మరియు దాని ద్వారా వచ్చే ఆదాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్ డేవిడ్ జయపాల్ దేశి వ్యవసాయ కోర్సు శిక్షకుడు, జి దీపక్ మండల వ్యవసాయ అధికారి జూలూరుపాడు, రాజేశ్వరి మండల వ్యవసాయధికారి చు%శీ%చుపల్లి , రంజిత్ టెక్నికల్ అసిస్టెంట్ మరియు డీలర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు దొరికేసిన ట్రబుల్ షూటర్



హైదరాబాద్: పీసీసీ చీఫ్ అంటే.. పార్టీకే పరిమితం. కార్యకర్తలు, నేతల సమావేశం..పేరుకే అధ్యక్షుడు అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యాక..పదవిని బాధ్యతగా ఫీల్ అవుతున్నారట. ప్రభుత్వ విషయాల్లో జోక్యం చేసుకోకుండా..పార్టీలో సీనియర్లను నొప్పించకుండా వ్యవహారాలను చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారట.పీసీసీ చీఫ్‌గా మహేశ్ గౌడ్ చేసిన ఒక ప్రయత్నం.. ప్రతి వారం ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా చేసింది. సామాన్య కార్యకర్తలు, కిందిస్థాయి నేతలు మంత్రులను కలవడానికి చాలా ఇబ్బంది పడేవారు. గాంధీభవన్‌కు మంత్రులు వస్తుండటంతో నేరుగా వారిని కలిసి సమస్యలు చెప్పుకుంటున్నారు. దీంతో పార్టీ క్యాడర్‌కు ప్రభుత్వం దగ్గరైందన్న ఫీలింగ్ కలుగుతుందంటున్నారు హస్తం నేతలు.పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవతో చాలామంది గాంధీభవన్ మెట్లెక్కి సమస్యలు చెప్పుకుంటున్నారు. పార్టీ ఆఫీస్‌కు వచ్చేవారి విషయంలో కూడా మహేశ్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ.. పరిష్కార మార్గం చూపిస్తున్నారు. జీవో 317తో ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల అంశం విషయంలో పీసీసీ చీఫ్ చొరవ తీసుకొని మంత్రులను గాంధీభవన్‌కు పిలిచి చర్చలు జరిపేలా చేశారు.అక్టోబర్ 2న జీవో 317కు సంబంధించిన బాధిత ఉద్యోగులు గాంధీభవన్ ముట్టడికి వచ్చారు. కానీ వారిని లోపలికి పిలిచి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలతో చర్చలు జరిపించారు. ఉద్యోగుల ఇబ్బందులను కచ్చితంగా పరిష్కారం చూపుతామని సర్దిచెప్పారు.లేటెస్ట్‌గా జీవో 29 విషయంలో గ్రూప్-1 అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. కొందరు అభ్యర్థులు గాంధీభవన్ ముట్టడికి వస్తే వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ జోక్యం చేసుకొని వారిని వదలిపెట్టాలని పోలీసులకు సూచించడమే కాకుండా.. గాంధీభవన్‌కు పిలిచి గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలు విన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చి..మంత్రులను స్వయంగా కలిసి జీవో 29పై చర్చలు జరిపారు.

ఒక బీసీ బిడ్డగా రిజర్వేషన్ల విషయంలో నష్టం జరిగితే ఊరుకోనని.. ఎలాంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు.ఏ సమస్య వచ్చినా తన భుజాన వేసుకొని పరిష్కారం చూపుతున్నారు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్. ప్రతిపక్షాల విమర్శలను కూడా తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా, మూసీ వంటి విషయంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అండగా ఉంటూ విపక్షాలను ఎండగడుతున్నారు. పైగా ప్రభుత్వానికి..పార్టీకి మధ్య అనుసంధాన కర్తగా వ్యహరిస్తూ..అన్ని తానై పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు

# కలహాల కామ్రేడ్లు...

హైదరాబాద్: తెలంగాణ సీపీఐ పార్టీలో నేతలది తలోదారి అయిపోయింది. సీపీఐ కేంద్ర కమిటీకి, తెలంగాణ కమిటీకి మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇందుకు హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమమే కారణమని అంటున్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణం మీద సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఓ వీడియో విడుదల చేశారు.ఆయన మరణానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని, అందులో భాగమైన దత్తాత్రేయ నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరు కాబోమన్నారు నారాయణ. సాయిబాబా ఎజెండా విషయంలో పార్టీకి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఆయన విషయంలో మాత్రం కచ్చితంగా మానవ హక్కుల ఉల్లంఘున జరిగిందని నారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఇంత వరకు బాగానే ఉన్నా.. అది సీపీఐ స్టాండ్ అనుకుంటున్న సమయంలోనే ఈ అంశం కీలక మలుపు తీసుకుంది. దత్తాత్రేయ ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకాబోమని జాతీయ కార్యదర్శి నారాయణ చేసిన ప్రకటనతో సంబంధం లేకుండానే ఆ కార్యక్రమానికి హాజరయ్యారు సీపీఐ పార్టీ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు.ఇదే ఇప్పుడు సీపీఐ పార్టీలో కొత్త చర్చకు దారితీసింది. సీపీఐ రాష్ట్ర కమిటీ, కేంద్ర కమిటీలకు వేర్వేరు అభిప్రాయాలు ఉంటున్నాయా అన్న సందేహం మొదలైంది. ఒకే పార్టీలో ఢిల్లీ నాయకత్వం ఒకలాగా, తెలంగాణ నాయకత్వం మరోలా వ్యవహరిస్తున్నాయన్న చర్చ నడుస్తోంది. అసలు కామ్రేడ్స్ మధ్య భిన్నాభిప్రాయాలు, విరుద్ధమైన నిర్ణయాలకు కారణమేంటన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కూనంనేని సాంబశివ రావు అలయ్ బలయ్‌కి వెళ్ళడంతో పాటు.. బండారు దత్తాత్రేయను ఆకాశానికి ఎత్తేయడంతో తెలంగాణ సీపీఐలో అసలేం జరుగుతోందన్న చర్చ మొదలైంది. బండారు దత్తాత్రేయ ప్రయత్నాన్ని సీపీఐ ఆహ్వానిస్తోందని కూనంనేని సాంబశివరావు చెప్పడంతోనే అసలు సమస్య మొదలైందని అంటున్నారు. దీంతో సీపీఐలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయా.. లేదంటే సమన్వయ లోపామా..అన్న అనుమానాలు తలెత్తుతున్నాయట. అయితే ఈ వ్యవహారంలో నారాయణకు, రాష్ట్ర కార్యవర్గానికి మధ్య సమాచారం లోపం ఉన్నట్టు సీపీఐ నేతలు చెబుతున్నారు.ప్రొఫెసర్ సాయిబాబా విషయంలో సీపీఐ జాతీయ నాయకత్వం తరఫున నారాయణ తన అభిప్రాయాన్ని చెప్పారని, అక్కడే సమాచార లోపం ఉన్నట్టు చెబుతున్నాయి పార్టీ వర్గాలు. అయితే కారణం ఏదైనా బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమం మాత్రం కామ్రేడ్స్ మధ్య భేదాభిప్రాయాలకు కారణమైంది. ఇది కేవలం సమాచారం లోపమేనా లేదంటే సీపీఐ రాష్ట్ర, కేంద్ర కమిటీల్లోని నేతల మధ్యపైకి కనిపించని విభేదాలు ఇంకేమైనా ఉన్నాయా అన్న డౌన్స్ వ్యక్తం అవుతున్నాయి.

# రబీకే రుణమాఫీ...

నిజామాబాద్: వానాకాలం సీజన్ పంట పెట్టుబడి సాయంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే సీజన్ రబీ నుంచే రైతు భరోసా ఇస్తామని చెప్పారు. మీడియాతో మాట్లాడిన ఆయన? ఈ ఖరీఫ్ సీజన్ కు పంట పెట్టుబడి సాయం ఉండదని ఓ ప్రశ్నకు జవాబునిచ్చారు.రైతు భరోసా స్కీమ్ పై మంత్రి ఉపసంఘం ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. సబ్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే.. స్కీమ్ ను అమలు చేస్తామని ప్రకటించారు. అంటే ఈ సీజన్ కు రైతు భరోసా ఉండబోదని? వచ్చే సీజన్ రబీ నాటికి పంట పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. అర్హత ఉన్న రైతుకు ప్రతి ఎకరానికి రూ. 7500 చెల్లిస్తామని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియలో ఇప్పటికే రైతులకు రుణమాఫీ కాగా...పలు సాంకేతిక కారణాలతో పలువురికి రుణమాఫీ నిలిచిపోయింది. రుణమాఫీ కాని వారి సమస్యలు పరిష్కరించి...అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అయ్యేలా చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారులు సాంకేతిక అడ్డంకులు తొలగించే పనిలో ఉన్నారు. మరో 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రభుత్వంలోని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు.ఇదే విషయంపై ఇటీవలే మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. అక్టోబర్ 31 నాటికి రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్న, అర్హులైన వారందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. నవంబర్ 1 నుంచి రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలున్న రైతుల రుణమాఫీపై ప్రక్రియ చేపడతామన్నారు. దీంతో రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు... ముందుగా పైన ఉన్న రుణాన్ని అక్టోబర్ 31లోపు క్లియర్ చేసుకోవాల్సి ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే రూ.31 వేల కోట్ల రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నల్లగొండలో మాట్లాడిన మంత్రి?ఇప్పటి వరకూ 22 లక్షల రేషన్ కార్డులు కలిగిన రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నగదు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి రేషన్ కార్డులు మిగిలిన 4 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పైన రుణాల మాఫీపై షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని తుమ్మల స్పష్టం చేశారు.

# డేటింగ్ యాప్ తో ఊడ్చేస్తున్నారు...

బెంగళూరు: దేశంలో పెళ్లి కాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. వారి ఆశల్ని ఆసరగా చేసుకుని వారిని నిట్టనిలువుగా ముంచేసే వారు కూడా పెరిగిపోతున్నారు. ఇలా మోసాల బారిన పడుతున్న వారికి అలా పెళ్లి కావడం లేదు.. ఇలా ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. తాజాగా బెంగళూరులో ఇలాంటి మోసం ఒకటి వెలుగు చూసింది. బెంగళూరలో ఉండే సురేష్ సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. చాలా రోజుల నుంచి పెళ్లి చేసుకుందామని చూస్తున్నాడు కానీ సంబంధాలు రావడం లేదు. మ్యాట్రిమోని సైట్లలో సహా అన్ని ప్రయత్నాలు చేశాక విసుగుపుట్టేసింది. ఇక ఏం చేయాలో తెలియక చివరి ప్రయత్నంగా ఓ డేటింగ్ యాప్ డౌన్ లోడ్ చేసుకుని అందులో ప్రొఫైల్ క్రియేట్ చేసుకున్నాయి. ఓ ఫైన్ మార్నింగ్ అతనికి మంచి సందేశం వచ్చింది. మీరు కోరుకున్న లక్షణాలు ఉన్న అమ్మాయి ఉంది.. మాట్లాడండి అంటూ నెంబర్ వచ్చింది. అంతే ఎగిరి గంతేసిన సురేష్.. మాట్లాటం ప్రారంచారు. అసలే లైఫ్ పార్టనర్ దొరుకుతుందా లేదా అన్న అశ నిరాశల్లో ఉన్న సురేష్ కు ఆ అమ్మాయి మాటలు విన్న తర్వాత సోల్ మేట్ దొరికిందని సంబరపడ్డాడు. ఎంతగా అంటే తనకు ఇంత కాలం పెళ్లి కాకపోవడానికి కారణం ఇలాంటి సోల్ మేట్ దొరకకపోవడమేనని గట్టిగా నమ్మాడు. వారిద్దరూ పెళ్లికి ప్రణాళికలు కూడా వేసుకున్నారు. ఈ క్రమంలో ఆమె మన భవిష్యత్ కు గ్యారంటీ ఏమిటి.. ఆర్థిక పరమన సుస్థిరత ఎలా వంటి చర్చలు తీసుకు వచ్చింది. ఆ సమయంలో తనకు తెలిసిన పెట్టబడి యాప్ ఉందని.. పెద్ద ఎత్తున డబ్బులు వస్తాయని చెప్పింది. అప్పటికే సోల్ మేట్ ఏదంటే అది చేసే పరిస్థితికి వెళ్లిన ఆయన .. పెట్టుబుడులు ప్రారంభించాడు. మొదట పదివేలు పెడితే వెంటనే ఇరవై వేలు వచ్చాయి. అలా పెట్టుబడులు పెట్టడం.. రావడం జరుగుతూ వస్తోంది. అలా ఆ అమ్మాయి ప్రోత్సహిస్తూండటం ఇక్కడ పెద్ద ఎత్తున డబ్బులు వస్తున్నట్లుగా కనిపిస్తూండటంతో మొత్తంగా యాభై లక్షలు పెట్టుబడి పెట్టాడు. అది కాస్తా నెలల్లోనే 73 లక్షలు అయినట్లుగా లెక్క చూపిస్తోంది. ఓ సారి ఆ డబ్బును డ్రా చేసుకుందామని అనుకున్నాడు సురేష్ . డ్రా చేసుకోవాలంటే 32 లక్షల ఫీజు చెల్లించాలన్నారు ఆ యాప్ కస్టమర్ కేర్ సర్వీస్ అధికారులు. తన సోల్ మేట్ కూడా కట్టేయమని చెప్పడంతో మొదటి సారి అనుమానపడ్డాడు. తన దగ్గర చిల్లి గవ్వ కుండా పెట్టుబడి పెట్టానని ఇప్పుడు తన డబ్బులు వెనక్కి రాకపోతే ఇబ్బంది పడతానని సోల్ మేట్‌కు చెప్పుకున్నాడు. ఆ అమ్మాయి కూడా ఎంత వస్తే అంత పిండుకుందామని.. ఎనిమిది లక్షలైనా కట్టమని ఒత్తిడి తెచ్చింది. తర్వాత అసలు ఫోన్ చేయడం మానేసింది. ఫోన్ నెంబర్ కూడా పని చేయడం లేదు.

ఆ యాప్ సురేష్ ను బ్లాక్ చేసింది. దీంతో లబోదిబోమంటూ పోలీసుల్ని ఆశ్రయించాల్సి వచ్చింది సురేష్. అందుకే ఇలాంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

# సన్నాల సమస్య.. మిల్లింగ్ కుససేమిరా

కరీంనగర్: సన్న వరి ధాన్యం సమస్యగా మారుతుంది. ప్రభుత్వం క్వింటాలకు రూ.500 బోనస్ సన్నాలకు ఇస్తామని ప్రకటించడంతో ఖరీఫ్ సీజన్లో ఎక్కువ మంది రైతులు సన్న వరి సాగు చేశారు.ప్రస్తుతం పంట చేతికి అందడంతో అమ్ముకోవడానికి ఇబ్బంది లేకపోయినప్పటికీ మిల్లింగ్ చేసేందుకు మిల్లర్స్ ససేమిరా అంటున్నారు.తెలంగాణలో సన్న వరి సాగు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. సాగు పెరగడంతో క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని మిల్లర్లు చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్ కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ సమస్యగా మారుతుంది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వానాకాలం సీజన్లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు.ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు.మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాల్ కు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది.సన్నాల్లకు బోనస్ ప్రకటించిన ప్రభుత్వం, ఐకెపి, సహకార సంఘాలు ద్వారా కొనుగోలు చేసి మిల్లర్స్ కు అప్పగించి మిల్లింగ్ చేశాక ప్రభుత్వమే తీసుకోనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. అయితే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.కానీ సన్న ధాన్యం మిల్లింగ్ కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఆ సమస్య పరిష్కారం అయిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రా రైస్ మిల్లర్స్ కోరుతున్నారు.సాధారణంగా దొడ్డు రకం దాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు. దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాల్సి ఉంటుంది.సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్ కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు. దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ చార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు మిల్లర్లు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏ నిర్ణయం రాకపోవడంతో సన్నాల కొనుగోళ్ళు ఇంకా జరగడం లేదు. ప్రైవేట్ ట్రేడర్స్, వ్యాపారులు సన్నాలను తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసి సొమ్ము చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

# గుత్తా వర్సెస్ కోమటిరెడ్డి...

### ఆధిపత్య పోరులో నేతలు



నల్గొండ: ఆయన మంత్రి.. ఈయనేమో అధికార పార్టీతో సన్నిహితంగా ఉండే విపక్ష నేత. ఈ ఇద్దరు ఒకప్పుడు మాటలను తూటాల్లా వాడుకున్నవాళ్లే! అలాంటిది ఇప్పుడు ఇద్దరి మధ్య యుద్ధం మొదలైంది. అది అలాంటి ఇలాంటి వార్ కాదు.. ఆధిపత్య పోరు. వాళ్లే మంత్రి కోమటిరెడ్డి.. మండలి ఛైర్మన్ గుత్తా. ఇంతకీ ఇద్దరి మధ్య ఏం జరిగింది.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయ్. జంపింగ్ జపాంగ్‌లు పెరిగిపోయాయ్. అధికార కాంగ్రెస్‌లో చేరడమో.. అనుకూలంగా ఉండటమో చేస్తున్నారు నేతలు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ అయి మండలి చైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి.. కాంగ్రెస్లో చేరకపోయినా.. కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిపోయారు.ఆయన కుమారుడు అమిత్ రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరి కార్పొరేషన్ చైర్మన్ అయిపోయారు. నల్లగొండ జిల్లా సీనియర్ నేత కావడంతో.. ఆయనకు మొదట్లో మంచి గౌరవం దక్కేది. దీంతో జిల్లాకు గుత్తా రెగ్యులర్‌గా ట్రిప్‌లు వేసేవారు. ఐతే కొంతకాలంగా పరిస్థితి మారింది. పెద్దాయన ట్రిప్‌లకు బ్రేక్‌లు పడుతున్నాయ్. మంత్రి కోమటిరెడ్డితో విభేదాలు మొదలయ్యాయనే చర్చ మొదలైంది. దీంతో నల్లగొండ పాలిటిక్స్‌లో ముసలం పుట్టింది.గుత్తా రెగ్యులర్‌గా నల్లగొండలో పర్యటనలు చేస్తుండడంతో.. కాంగ్రెస్ కార్యకర్తల్లో అభద్రతా భావం పెరిగింది. ఇక నల్గొండ వెళ్లిన ప్రతిసారి.. తన అనుచరులను చేరదీసుకొని.. వారికే ప్రయారిటీ ఇవ్వడం మొదలుపెట్టారు గుత్తా. పోలీస్‌స్టేషన్, తహశీల్దార్ ఆఫీసులకు ఫోన్ చేసి.. అనుచరుల పనులు చేయిస్తున్నారు. అటు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండడంతో.. ఆయన ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితం అవుతున్నారు. దీంతో కార్యకర్తలకు అంతగా సమయం కేటాయించలేకపోతున్నారు.జిల్లాలో గుత్తా సుఖేందర్ రెడ్డి ద్వారా.. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న నేతలవే పనులు అవుతున్నాయ్. ఈ వ్యవహారం అంతా తీసుకెళ్లి మంత్రి దగ్గర పంచాయతీ పెట్టారు కార్యకర్తలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. తమ పనులు కావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. గుత్తాకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేనంటూ మంత్రిని వేడుకున్నారట. దీంతో ఇంకేముంది కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగంలోకి దిగారు.గుత్తాకు చెక్ పెట్టేందుకు.. తమ చేతికి మట్టి అంటకుండా.. జిల్లా ఎస్పీని మంత్రి కోమటిరెడ్డి రంగంలోకి దించారనే ప్రచారం జరుగుతోంది. గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి చైర్మన్ కావడంతో.. ఆయన జిల్లాకు వచ్చినప్పుడు ప్రోటోకాల్ ప్రకారం ఎస్కార్ట్‌గా స్థానిక ఎస్ఐ, సీఐ వెళ్లడం కామన్. ఐతే జిల్లాలో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉందని.. మంత్రితో సహా వీఐపీలు ఎవరు వచ్చినా పోలీస్ సిబ్బంది రావడం కుదరదంటూ.. నల్లగొండ జిల్లా ఎస్పీ ఒక లెటర్ విడుదల చేశారు.లేఖ విడుదల తర్వాత.. మండలి చైర్మన్ గుత్తాకు పోలీస్ ఎస్కార్ట్ ఆగిపోయింది. ఇక్కడితో ఆగారా అంటే.. గుత్తాకు మరో షాక్ తగిలింది. గుత్తా జిల్లాకు వస్తే.. ఆయన వాహనాలకు డీజిల్ కొట్టించడం కూడా ఆపేశారట. జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకులకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని.. పెట్రోల్, డీజిల్ పోయడం కుదరదని చెప్తున్నారట. జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వచ్చినా.. ఆయనే స్వయంగా డబ్బులు పెట్టి పెట్రోల్, డీజిల్ కొట్టించుకుంటున్నారని అధికారులు సమాధానం ఇస్తున్నారు.ఇలా కోమటిరెడ్డి వర్సెస్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యవహారంతో? నల్గొండ జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారాయ్. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి, చెక్ పెట్టేందుకు మంత్రి కోమటిరెడ్డి చేసిన ఈ ఎత్తు ఆసక్తికరంగా మారింది.

# తలలు పట్టుకుంటున్న పత్తి రైతులు

కరీంనగర్: కరీంనగర్ జిల్లా జమ్మికుంట కాటన్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు గత వారం నుండి కొత్త పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అయితే..ఇప్పుడు..ఇప్పుడే పత్తి మార్కెట్‌లోకి వస్తుంది. అయితే..పత్తికి కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.. క్వింటల్‌కు రూ.7521 ప్రభుత్వం ప్రకటించింది.అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కూడా కొనుగోలు చేయడం లేదని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యత పేరుతో 7 వేల లోపే కొనుగోలు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే పత్తి ధరలు తక్కువగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. కూలి రేట్లు పురుగుమందుల ధరలు ఎరువుల ధరలు అధికంగా పెరిగిపోయాయి. అంతేకాకుండా ప్రతికూల వాతావరణంతో దిగుబడి తగ్గింది. మద్దతు ధర రూ.8 వేల నుంచి 9వేల వరకు ఉండే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతుల కోరుతున్నారు. అయితే మార్కెట్లో ఇప్పటికీ సీసీఐ కొనుగోలు ప్రారంభించలేదు. టెండర్లు పూర్తి అయ్యాయని 10 కాటన్ మిల్లులలో సీసీఐ కొనుగోలు వారం రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

అయితే ప్రైవేట్ వ్యాపారులు ఇష్టరాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు. మెజారిటీ మార్కెట్లలో ఇంకా పత్తి కొనుగోలు చేయలేదు. పత్తి ధర తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# భారీగా పలు రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు.

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో వివిధ రోడ్లు వంతెన నిర్మాణం కోసం పంచాయతీరాజ్ సీ ఆర్ ఆర్ (గ్రాంట్స్ నుండి 1149.00 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది.. హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం కోసం ఇంత పెద్ద నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు.. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలో కోహెడ నుండి తంగలపల్లి (వయ కురెళ్ళ) వరకు 1.10 కిమి బిటి రోడ్డు కోసం 155.00 లక్షలు, కోహెడ మండలం తంగలపల్లి నుండి శ్రీరాములపల్లి పీడబ్ల్యూ రోడ్డు వరకు ( వయ కోహెడ మండలం సోమరంపల్లి) వరకు 1.60 కిమీ బిటి రోడ్డు నిర్మాణం కోసం 150.00 లక్షలు, హుస్నాబాద్ మండలం పందిల్ల స్టేజి ఆర్ ఎఫ్ సిద్దిపేట పీడబ్ల్యూ డీ రోడ్డు నుండి పొట్లపల్లి వరకు ఉన్న సింగిల్ లైన్ రోడ్డు నుండి 5.50 కిమీ డబుల్ లైన్ రోడ్డు విస్తరణ కోసం 395.00 లక్షలు,
అక్కన్నపేట మండలం సంజీవయ్య కాలని లో ఆర్ అండ్ బీ
రోడ్డు 1.25 కిమి కోసం 140.00 లక్షలు,
అక్కన్నపేట మండలం ఆర్ ఎఫ్, పీడబ్ల్యూ డీ రోడ్డులో సీడీ వర్క్ కోసం చౌటపల్లి మీదుగా మల్లంపల్లి వరకు 100.00 లక్షలు, అక్కన్నపేట మండలం జడ్పీ రోడ్డు నుండి పరికబండ వరకు 0.50 కిమీ కోసం 60.00 లక్షలు, తోటపల్లి నుండి పుసవర్లపల్లి మధ్య వంతెన నిర్మాణం కోసం 149.00 లక్షలు, హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీగా రోడ్ల నిర్మాణం వంతెన కోసం నిధుల విడుదల కు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

# హస్తం గూటికి మరో ఎమ్మెల్యే ?

మహబూబ్ నగర్: అన్ని నియోజకవర్గాల్లో ఓ లెక్క అక్కడ ఓ లెక్క అన్నట్టు కొనసాగుతుంది అక్కడ పరిస్థితి. ఎక్కడైనా ఎమ్మెల్యేలు క్యాంప్ ఆఫీసులో కనిపిస్తారు కానీ ఆ ఎమ్మెల్యే నియోజకవర్గంలో క్యాంపు ఆఫీసు ఉన్న సంగతే మరిచిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. క్యాంపు ఆఫీసులో కార్యకలాపాలు కలిసి రావన్న సెంటిమెంట్‌లో ఆ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ఏకంగా పాడు పెట్టేస్తున్నారు. దీంతో ఆయన్ని కలవడానికి నియోజకవర్గ ప్రజలు సరిహద్దు దాటి పక్క రాష్ట్రం పోవాల్సి వస్తుందంట. నియోజక వర్గం కంటే నాకు ఇక్కడే కంఫర్ట్ అన్నట్లు వ్యవహరిస్తున్న ఆ గులాబీ పార్టీ ఎమ్మెల్యే ఎవరు?గద్వాల జిల్లాలోని అలంపూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజక వర్గం నుంచి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి విజయుడు గెలుపొందారు. అప్పటి వరకు కొనసాగిన సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంను కాదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచించిన వ్యక్తికి గులాబీ బాస్ టికెట్ కేటాయించారు. వెంకట్రామిరెడ్డి అనుచరుడు, ఎలాంటి రాజకీయ అనుభవం లేని ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న విజయుడుకి టికెట్ ఇచ్చారు. వెంకట్రామిరెడ్డి అన్ని తానై వ్యవహరించి విజయుడిని గెలిపించుకున్నారు.ఇంత వరకు బాగానే ఉంది . గెలిచిన విజయుడు నియోజక వర్గంలోని అలంపూర్ క్యాంప్ ఆఫీస్ వైపు తొంగి కూడా చూడకపోవడంపై నియోజక వర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే నివాసంతో పాటు , ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో గత కేసిఆర్ ప్రభుత్వంలో క్యాంపు ఆఫీస్ ల నిర్మాణం జరిగింది . అయితే క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన గులాబీ పార్టీ ఎమ్మెల్యే విజయుడు మాత్రం పక్క రాష్ట్ర మైన , కర్నూలు లోని ఎమ్మెల్సి చల్లా వెంకట్రామిరెడ్డి కాంపౌండ్ నే తన కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకోవడం చర్చనీయాంశంగా మారింది.దాంతో తమ అవసరాల కోసం ఎమ్మెల్యేను కలవాల్సిన వారంతా రాష్ట్ర సరిహద్దు దాటి కర్నూలు పోవాల్సి వస్తుంది. కర్నూలులోని ఎమ్మెల్సి చల్లా వెంకట్రామి రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే విజయుడి కోసం ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించడంతో అలంపూర్ నియోజక వర్గం పాలన అంతా ఆ గది కేంద్రంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పథకాలు తీసుకోవాలన్నా.., తమ బాధలు చెప్పుకోవాలన్నా, నియోజక వర్గం లోని ఆయా మండలాల నుంచి కర్నూలులోని చల్లా కాంపౌండ్ బాట పట్టాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.కర్నూలు పట్టణం నియోజక వర్గానికి సరిహద్దు ప్రాంతం అయినప్పటికీ వివిధ మండలాల నుంచి కర్నూలు వెళ్లడమనేది వ్యయ ప్రయాసలతో కూడిన అంశమే. నియోజక వర్గంలో క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా పాలన ఉంటే అన్నింటికి సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. అదలా ఉంటే అలంపూర్ చౌరస్తా లో లక్షల వ్యయంతో నిర్మించిన క్యాంప్ ఆఫీస్ నుంచే మాజీ ఎమ్మెల్యే అబ్రహం కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే వారు . క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా సిబ్బంది నియామకం చేపట్టి , వివిధ మండలాల నుంచే వచ్చే వారి నుంచి వినతులు , దరఖాస్తులు స్వీకరించి అక్కడి నుంచే ప్రభుత్వ పథకాల పంపిణీ చేపట్టే వారు.అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకు టికెట్ దక్కక పోవడంతో చల్లా ఆశీస్సులతో విజయుడు టికెట్ దక్కించుకుని గెలుపొందారు . అబ్రహంకు క్యాంప్ ఆఫీస్ కలిసి రాక పోవడం



వల్లనే అలా జరిగిందని , అక్కడి నుంచి ఎమ్మెల్యే పాలన వ్యవహారాలు నడిపిస్తే తనకు కూడా భవిష్యత్ ఉండదనే సెంటిమెంట్‌తో ఎమ్మెల్యే విజయుడు క్యాంప్ ఆఫీస్ వైపు కూడా తొంగి చూడటం లేదని గులాబీ శిబిరం లో చర్చ సాగుతుంది . అదేమి కాదు , అన్నీ తానై వ్యవహరించి టికెట్ ఇప్పించుకోని గెలిపించుకున్న ఎమ్మెల్సి చల్లా.. ఎమ్మెల్యే విజయుడు మరో పవర్ పాయింట్‌లా తయారవుతారనే ముందు జాగ్రత్తతో ?తన పర్యవేక్షణ లో కార్యకలాపాలు కొనసాగేలా జాగ్రత్త పడ్డారని మరికొందరు చర్చించుకుంటున్నారు.ఇక ఇదే సమయంలో నియోజకవర్గం లో పాలన వ్యవహారాల్లో అన్ని కీలక నిర్ణయాలకు సంబంధించి ఎమ్మెల్సీ చల్లా గ్రీన్ సిగ్నల్ తరువాతే ఎమ్మెల్యే విజయుడు ఒకే చెప్తారు. త్వరలో వీరు గులాబీ గూటికి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎలాంటి రాజకీయ అనుభవం లేని విజయుడు.. భవిష్యత్‌పై భరోసా లేకున్నా చల్లా వెంకట్రామిరెడ్డి నిర్ణయాన్ని కాదన లేకపోతున్నారంట.మొత్తం మీద గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో జనాలతో కళకళలాడిన అలంపూర్ క్యాంప్ ఆఫీస్ , ఇప్పుడు ఆఫీసుకు వచ్చే వారు లేక వెలవెలబోతోంది . లక్షల రూపాయల ప్రజా ధనం తో నిర్మించిన ఆ భవనాన్ని వినియోగంలోకి తేవాలని. భవనానికి ఏదైనా వాస్తు దోషం ఉంటే మరమ్మత్తులు చేయించుకుని.. ఎమ్మెల్యే నియోజక వర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు. మరి ఎమ్మెల్యే రిమోట్ తన చేతిలో పెట్టుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి దీనిపై ఎలా రియాక్ట్ అవుతారో? చూడాలి.

# మూసి పునరుజ్జీవవ సన్నాహక సమావేశం

మేడ్చల్: మేడ్చల్ జిల్లా మేడిపల్లి లోని ఎస్వీఎం హోటల్ లో మూసీ పునరుజ్జీవన కొరకై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతాలైన శాలిగౌరారం , మోత్కూర్ , అడ్డగూడూరు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలకు మూసీ పునరుజ్జీవన సభ గురించి ఎమ్మెల్యే సామేలు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మందుల సామేలు మాట్లాడుతూ జీవనది అయిన మూసీని సుందరీకరణ చేసి మూసీ పరివాహక ప్రాంతాల రైతులకు స్వచ్ఛమైన తాగు , సాగు నీటిని అందించేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కి మద్దతుగా ఈనెల ఇరవై ఏడున మూసీ పునరుజ్జీవన కోసం శాలిగౌరారం మండలం మానాయికుంట బ్రిడ్జి పై పదిహేను వేల మందితో మహసభ పెట్టి సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు ...

# వట్‌పల్లిలో సినీ ఫక్కీలో చోరీ

**– ఐదున్నర తులాల బంగారం, రూ.20వేల నగదు దోపిడీ**

**– ముఖాలు తెలియకుండా హెల్మెట్లు ధరించిన దుండగులు**

వట్‌పల్లి: ఒంటరిగా ఉంటున్న ఓ మహిళ ఇంటికి అర్ధరాత్రి వేళ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు.. తమను ఆమె కుమారుడు పంట కోయడానికి పంపించాడని నమ్మబలికి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం ఆమె కాళ్ళు, చేతులు చీరతో కట్టేసి ఇంటిని లూటీ చేశారు. ఐదున్నర తులాల బంగారం, రూ.20 వేల నగదును అపహరించుకుపోయారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పల్వట్లలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగారెడ్డి గారి సునందమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె కుమారుడు వెంకటరెడ్డి బీదర్‌లో నివాసం ఉంటూ వారంలో ఒకటి రెండు సార్లు ఇంటికొచ్చి.. వ్యవసాయ పనులు చూసుకొని తిరిగి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి సుమారు 12:30 సమయంలో సునందమ్మ ఇంటికి కొందరు దుండగులు వచ్చారు. సోయపంట కోసేవారిమని, తన కొడుకు పంపించాడని, వర్షం పడే అవకాశముండటంతో ఇంట్లో పడుకోమన్నాడని సునందమ్మను నమ్మించారు. దీంతో ఆమె తలుపులు తెరిచి ఇంట్లోకి రానివ్వగా వెంటనే వారు సునందమ్మను చేయితో తలపై కొట్టి చీరతో కాళ్లు, చేతులు కట్టేశారు. బంగారం, డబ్బు ఎక్కడ ఉన్నదో చెప్పాలని.. లేకపోతే చంపేస్తామని చాకులతో బెదిరించారు. దాంతో రూ.20 వేల నగదు గురించి ఆమె చెప్పడంతో.. వాటిని తీసుకున్నారు. అలాగే ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల తాడు, చేతి వేళ్లకు ఉన్న ఉంగరాలు, చెవుల పోగులను లాక్కున్నారు. ముఖాలు తెలియకుండా హెల్మెట్లను ధరించుకొని ఇల్లు మొత్తం లూటీ చేశారు. వెళ్లే ముందు ఆమెపై బిందెడు నీళ్లు పోసి వెళ్లారు. తెల్లవారిన తర్వాత సునందమ్మనే కొంత ధైర్యం చేసుకుని.. కట్లు తెచ్చుకొని బయటికి వచ్చింది. ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రల కోసం ప్రయత్నించగా లభ్యం కాలేదు. కాగా ఘటనా స్థలాన్ని సీఐ అనిల్ కుమార్ పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితురాలి కొడుకు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థుల చదువులు ఎట్లా సిఎం గారు?

**– విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం**

**– ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల పై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు**

**– ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మారటం లేదు**

**– ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**

**– ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులు ఛలో కలెక్టరేట్ కార్యక్రమం**

జగిత్యాల: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్యం చేస్తే విద్యార్థులు చదువుకునేది ఎట్లా అని, ఫీజు బకాయిల విడుదల పై అనాడు రేవంత్ రెడ్డి చెప్పింది ఏంది నేడు చేస్తున్న జాప్యం ఏంటని ఫీజు బకాయిలను 27లోపు విడుదల చేయకపోతే చలో ఇందిరాపార్క్ నిర్వహిస్తామని వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధనం చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు.. ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్ కి వెళ్ళగా అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిల విడుదల లేక విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఇబ్బందులు, పడుతున్నారన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ,పీజీ ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత మూడు సంవత్సరాల నుండి ఫీజుబకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసిన ప్రభుత్వం విడుదల చేయకుండా పెడచెవిన పెట్టడం సిగ్గు చేటనీ ఆన్నారు.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పీసీసీ అధ్యక్షుడు , నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఇప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆన్నారు. విద్యాశాఖ కూడా తన వద్దే పెట్టుకున్న విద్యాశాఖ కి నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడం లో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేక రకాల ఖర్చులు చేస్తూ అనేక చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం సరికాదని వెంటనే ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు టోకెన్ ఇచ్చినవి కాకుండా పెండింగ్ లో ఉన్న బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చలో సచివాలయం నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్ ఉపాధ్యక్షులు బచ్చల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి మచ్చ నితిన్, ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి మంద రాకేష్, కౌన్సిల్ సభ్యులు వివిధ మండల కార్యదర్శులు అధ్యక్షులు రాజేష్,పొన్నం వేణు, అంకటి ప్రణయ్, నరేష్ ,ఫర్హాన్ అరవింద్, సోహైల్ ఆసిఫ్ గర్ల్స్ నాగలక్ష్మి సౌమ్య శిరీష ఫర్హాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై అవగాహన

**–సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్**

జగిత్యాల: పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ పిలుపు నిచ్చారు. ఆదిలాబాద్,నిజామాబాద్,కరీంనగర్,మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ అసోసియేషన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు.జిల్లా తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్,తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ సబ్యులతో హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కువినియోగించుకున్న వారు సైతం మళ్లీ ఓటర్ గా నమోదు చేసుకోవాలన్నారు.వచ్చే నెల 6 వరకు గడువు ఉందని,2021 నవంబర్ వరకు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్ గా నమోదుకి అర్హులన్నారు.నవోదు కోసం డిగ్రీ మెమో,ప్రొవిజనల్ సర్టిఫికెట్,ఆధార్,ఓటర్ ఐ.డి.,ఈ మెయిల్ ఐ.డి,ఫోన్ నెంబర్,పాస్ పోర్ట్ సైజ్ ఫోటో అవసరమన్నారు.తమ పేన్షనర్స్,సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ల సభ్యులకు తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్ లైన్ ద్వారా నమోదుకు సూచిస్తూ తగు చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడుహరి ఆశోక్ కుమార్,ఉపాధ్యక్షుడు వెల్ముల ప్రకాష్ రావు,సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్,భోజి రెడ్డి సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రంగంలోకి సైబర్ కమాండోలు...

హైదరాబాద్: తెలంగాణలో రూ.759 కోట్లు, మహారాష్ట్రలో రూ.990 కోట్లు, ఉత్తరప్రదేశ్లో 721 కోట్లు, తమిళనాడులో 662 కోట్లు, గుజరాత్లో 650 కోట్లు.. ఇదీ రాష్ట్రాలవారీగా సైబర్ నేరగాళ్లు ఏడాది కాలంలో కొల్లగొట్టిన సొత్తు విలువ. సైబర్ నేరాలపై 2023లో 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్‌కు దేశవ్యాప్తంగా 11, 28,265 ఫిర్యాదులు వచ్చాయి. ఆయా బాధితులు మొత్తం రూ.7,488.6 కోట్లు కోల్పోయారు. ఈ సైబర్ ముఠాల ఎత్తుల్ని చిత్తు చేసేందుకు కేంద్ర హోంశాఖ సైబర్ కమాండోలను రంగంలోకి దించబోతోంది. శిక్షణ పూర్తి చేసుకుని త్వరలో రంగంలోకి దిగబోతున్నారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన సమస్యల్లో సైబర్ నేరాలు ఒకటి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటి నియంత్రణకు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అయితే ప్రస్తుతం వీటిపై ఉక్కుపాదం మోపేందుకు సైబర్ కమాండోలను కేంద్రం సిద్ధం చేస్తోంది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పోలీసులను సైబర్ కమాండోలుగా తీర్చదిద్దబోతోంది. వచ్చే ఐదేళ్లలో సుమారు 5,000 మందిని రంగంలోకి దించాలని కేంద్ర హోంశాఖ లక్ష్యంగా పెట్టుకొంది. ఈ బాధ్యతను ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ)కి అప్పగించింది. ఈ క్రమంలోనే తొలి విడతగా 346 మందిని ఎంపిక చేసింది. ముందుగా రాష్ట్రాల పోలీసులతోపాటు కేంద్ర పోలీస్ సంస్థలు, కేంద్ర పారామిలిటరీ బలగాల నుంచి 2023 అక్టోబరు 5న నామినేషన్లను ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా 1,128 దరఖాస్తులు రాగా?. ఈ ఏడాది ఫిబ్రవరి 24న 32 కేంద్రాల్లో శారీరక సామర్థ్య, రాతపరీక్షలు నిర్వహించారు. వీటిలో 747 మంది ఎంపిక కాగా?.వారిలో 346 మందిని షార్ట్ లిస్ట్ చేశారు. ఈ సైబర్ కమాండోలకు ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చి.. సైబర్ నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, ఛేదన తదితర అంశాల్లో మెరికలుగా తీర్చిదిద్దనున్నారు.సైబర్ కమాండోలుగా ఎంపికైన వారికి ఐఐటీ నిపుణుల పర్యవేక్షణలో పాఠాలు చెప్పించబోతున్నారు. జాయింట్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సమన్వయ), సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్(సీఎఫ్ఎంసీ) తదితర కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారు. హైదరాబాద్లోని సర్దార్ వల్లభ్బాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీతోపాటు కాన్పూర్, కొట్టాయం, నయా రాయ్పూర్ ఐఐటీలు, గాంధీనగర్ రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీ(ఆర్ఆర్యు). ఢిల్లీ, గోవా, గాంధీనగర్ నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీలు, పుణె డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ టెక్నాలజీ(డీఐఏటీ) తదితర ప్రఖ్యాత సంస్థల్లో తర్ఫీదు ఇస్తారు.

ఆరు నెలల అనంతరం కమాండోలు విధుల్లోకి చేరనున్నారు. వీరు సొంత రాష్ట్రాల్లో ఐదేళ్లపాటు పనిచేయాల్సి ఉంటుంది.అయితే ఈ శిక్షణ కోసం తెలంగాణ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్లో డిప్యూటీ అనలిటికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత కుమార్ ఎంపికయ్యారు. బీటెక్ సీఎస్ఈ చదివిన ప్రశాంత్ కుమార్‌కు సాంకేతికతపై పట్టు ఉండటంతో కానిస్టేబుల్‌గా ముందు నుంచీ సైబర్ నేరాల విభాగంలోనే ఉన్నారు.

# విదేశీ నుంచి స్వదేశీ చేతుల్లోకి ధరణి

**– ధరణి నిర్వహణను ఎన్.ఐ.సికి అప్పగిస్తూ ఉత్వర్వులు**

**– త్వరలో ధరణి సమస్యలనుంచి పూర్తిగా మిముక్తి కల్పిస్తాం**

హైదరాబాద్: ఇప్పటి వరకు విదేశీ సంస్థ టెర్రాసిస్ చేతిలో ఉన్న ధరణి నిర్వహణా బాధ్యతను స్వదేశీ సంస్థ ఎన్. ఐ. సికి అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.డిసెంబర్ 1 వతేదీ నుంచి తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణా బాధ్యతను జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసి ) నిర్వహిస్తుందని ఈ మేరకు ఉత్వర్వులు జారీ చేయడం జరిగిందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. త్వరలో ధరణి సమస్యల నుంచి ప్రజలకు పూర్తి విముక్తి కల్పిస్తామని వెల్లడించారు. ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం లోని పెద్దలు ఎలాంటి ముందు చూపు లేకుండా హడావుడిగా తొందరపాటు నిర్ణయాలతో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు తెలంగాణకు చెందిన 1.56 కోట్ల ఎకరాల భూమిని టెర్రాసిస్ అనే విదేశీ కంపెనీకి తాకట్టు పెట్టారని. ఒరిస్సా రాష్ట్రంలో ఈ సంస్థ పనిచేసి విఫలమైంది. ఇటువంటి సంస్థకు కేవలం తమ స్వార్ధ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పెద్దలు కట్టబెట్టినట్లు మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. లక్షలాది రైతుల లకు చెందిన కోట్లాది ఎకరాల వ్యవసాయ భూములను లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను గత బారాస ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రెవిన్యూ శాఖ మంత్రి అయినా కేసీఆర్ ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ఏకపక్షంగా యదేచ్ఛగా విదేశీ కంపెనీలకు అప్పగించగా ఐదేళ్లపాటు ధరణి పోర్టల్ రైతులను నానా ఇబ్బందులు పెట్టింది ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం ధరణి పోర్టల్ విదేశీ కంపెనీల చేతుల్లో నుంచి ప్రభుత్వం చేతిలోకి తీసుకుంటుందని కాంగ్రెస్ చెప్పిన ప్రకారం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి ఇవ్వడం అయినది తద్వారా 71, 00,000 ఖాతాల రైతుల భూములకు పూర్తి రక్షణ లభించినట్లయింది. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తాము ఎన్నికల ప్రణాళికలో ధరణి పోర్టల్ ప్రక్షాళన చేపడతామని ప్రకటించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నామని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు విదేశీ కంపెనీ చేతుల్లో ఉన్న తెలంగాణ భూములను కాపాడుకోవడానికి, ఆ కంపెనీ రద్దుకు నిర్ణయించామని మంత్రి తెలిపారు. ధరణి నిర్వహణా బాధ్యతను మార్చడం వలన రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలు సమస్యలు ,ఇబ్బందుల నుంచి బయటపడతాయని , అందరి భూ సమస్యలకు చక్కని పరిష్కారాలు త్వరలో లభిస్తాయని మంత్రి పొంగులేటి వివరించారు. 2020 అక్టోబర్ లో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ దారితప్పి లోపభూయిష్టంగా మారి ప్రజానీకానికి శాపంగా మారిందన్నారు. ధరణి పేరుతో జరిగినా దగా వల్ల తెలంగాణా సమాజం తీవ్రంగా నష్టపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను సమాధి చేసిందని మంత్రి ఆరోపించారు. ఆ నాటి ప్రభుత్వ పెద్దల దాష్టీకానికి ప్రజలు అనుభవించిన బాధలు అన్నీ ఇన్నీకావని, కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి చరమగీతం పాడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# బ్యాలెట్ తోనే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది

హైదరాబాద్: బ్యాలెట్ పేపర్ తో ఎన్నికల నిర్వహించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం లో దూసుకుపోతున్న అమెరికా వంటి అగ్ర రాజ్యాలు సైతం వారి ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుతెరగాలని అన్నారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఆందోళన గురిచేస్తుందని అన్నారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న ఎన్నికలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. మూసి ప్రక్షాళన పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మంచిదేనని మేధావులు, ఆయా రంగాల నిపుణులతో విస్తృతంగా చర్చించి ముందుకు వెళితే బాగుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుండగా ఆంధ్రప్రదేశ్ పరిస్థితి నానాటికి దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని చెప్పుకునే చంద్రబాబు తిరుపతి లడ్డు విషయం లో తప్పుగా మాట్లాడి ఆయన ఇమేజ్ ను తగ్గించుకున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశంలో తీవ్ర అలజడి నెలకొనే ప్రమాదం ఉందని అన్నారు. పాలకులు ప్రజలకు మెరుగైన పాలన అందించే అంశంపై దృష్టి సాధించాలని సూచించారు. దేశంలో పెరుగుతున్న ధరల్లోను తగ్గించి పేదలకు ఆహార ధాన్యాలు తక్కువ ధరలకు అందెల చూడాలని కోరార.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**